# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 87 | విశాఖపట్నం | 27-12-2025 శనివారం | చీఫ్ ఎడిటర్ : శ్రీనివాస్ లెక్కల | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 87 | VISAKHAPATNAM | 27-12-2025 SATURDAY | CHIEF EDITOR: SRINIVAS LEKKALA | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.
అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.
ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇంఛార్జ్ : ఎల్.కృష్ణ రావు

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9491286902


## భవిష్యతుల్లో భారతీయులు ప్రపంచాన్ని

# శాసిస్తారు: చంద్రబాబు



**అమరావతి, పతాకం న్యూస్:** భారతీయులు భవిష్యతుల్లో ప్రపంచాన్ని శాసిస్తారనడంలో సందేహం లేదని సీఎం చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. 2047 నాటికి అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతామని చెప్పారు. తిరుపతిలో నిర్వహించిన భారతీయ విజ్ఞాన సమ్మేళంలో చంద్రబాబు మాట్లాడతూ పేదరికం లేని దేశంగా భారత్ అభివ ృద్ధి చెందాలని ప్రతిపౌరుడు గౌరవంగా జీవించే పరిస్థితి కల్పించేలా ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ క ృషి చేయాలని కోరారు. మన దేశంలో నాలెడ్జ్‌కు కొదవలేదని అలానే దేశాభివృద్ధిలో అనేక రంగాలు మిళితమై ఉన్నాయని చెప్పారు. 1991లో ఆర్థిక సంస్కరణల తర్వాత అత్యంత కీలక మార్పులు చోటు చేసుకున్నాయని ఇంకా మన దేశంలో ప్రధాని మోదీ నాయకత్వంలో స్థిరమైన ప్రభుత్వం ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. 2038 నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించనుందని 2047 నాటికి ప్రపంచ శక్తిగా ఆవిరవేస్తుందని తెలిపారు. మన దేశం పేరు మార్మోగిపోతుందని, ఇప్పటికే ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా భారతీయులే ఉన్నారని కొనియాడారు. దశాబ్ద కాలంగా చాలా దేశాల్లో జనాభా తగ్గుతుండగా భారత్‌లో మాత్రమే పెరుగుతోందని వెల్లడించారు. తిరుపతిలో స్పేస్ సిటీ, కర్నూలులో డ్రోన్ సిటీ, అనంతపురంలో ఏరోస్పేస్ సిటీ, విశాఖలో మెడ్‌టెక్ పార్కు తీసుకొస్తున్నామని సీఎం వెల్లడించారు. ప్రపంచంలో అత్యధిక వేతనాలను భారతీయులు పొందుతున్నారని చెప్పారు. గతంలో హైదరాబాద్‌లో ఐటీని ప్రోత్సహించామని దీనితో ప్రపంచంలో తెలుగువారు ఎక్కువ వేతనాలు పొందుతున్నారని వివరించారు. అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్‌ను ప్రోత్సహిస్తున్నానని అలానే విశాఖలో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గూగుల్ వచ్చిందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. జల భద్రత ఉంటే దేశంలో అదతే కార్యక్రమాలు చేయగలమని అన్నారు. మన పురాణాలను నేటి యువతకు వివరించాలని అలానే అవతార్ సినిమా కంటే రామాయణం, మహాభారతం గొప్పవని మన పిల్లలకు చెప్పాలని సీఎం సూచించారు. సూపర్‌మ్యాన్, బ్యాట్‌మ్యాన్, ఐరన్‌మ్యాన్ కాకుండా అర్జునుడు, హనుమాన్ గురించి చెప్పాలని ఇంకా ఎన్టీఆర్ వంటి గొప్ప వ్యక్తుల గురించి నేటి సమాజానికి చెప్పాలని తెలిపారు. స ృజనాత్మకంగా, భిన్నంగా ఆలోచించాలని ప్రతి రంగానికి సాంకేతికతే వెన్నెముక అన్నారు. అలానే మానసిక ఒత్తిడిని అధిగమించడంలో యోగాది కీలకపాత్ర అని ఇటీవల విశాఖలో కూడా అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించామని వివరించారు. 1991 ఆర్థిక సంస్కరణల తర్వాత అత్యంత కీలక మార్పులు చోటు చేసుకున్నాయని సీఎం చంద్రబాబు తెలిపారు.

# కిమ్స్ టెండర్ వివాదం... అసలు విషయం చెప్పిన సత్యకుమార్



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌లో పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ పద్ధతిలో నిర్మించ తలపెట్టిన ఆదోని మెడికల్ కాలేజీ టెండర్ వ్యవహారంలో నెలకొన్న గందరగోళానికి ప్రభుత్వం తెరదించింది. ఆదోని కాలేజీకి కిమ్స్ ఆసుపత్రి బిడ్ వేసిందని తొలుత ప్రకటించిన ప్రభుత్వం, ఆ తర్వాత కిమ్స్ యాజమాన్యం దానిని ఖండించడంతో ఇరకాటంలో పడింది. ఈ వివాదంపై తాజాగా మంత్రి సత్యకుమార్ స్పష్టతనిచ్చారు. కిమ్స్ ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్ ప్రేమ్ చంద్ షా తన వ్యక్తిగత హోదాలో టెండర్ దాఖలు చేశారని, అయితే ఆయన కిమ్స్‌లో పనిచేస్తుండటంతో సంస్థే బిడ్ వేసిందని పొరపాటు పడ్డామని మంత్రి వివరించారు. "ఇది కేవలం ఒక చిన్న కమ్యూనికేషన్ గ్యాప్ మాత్రమే. కిమ్స్ సంస్థ ఎలాంటి బిడ్ వేయలేదు" అని ఆయన స్పష్టం చేశారు. అంతకుముందు, ప్రభుత్వం నాలుగు మెడికల్ కాలేజీలకు టెండర్లు పిలవగా, ఒక్క ఆదోని కాలేజీకి మాత్రమే కిమ్స్ నుంచి బిడ్ వచ్చిందని ప్రచారం జరిగింది. అయితే, ఈ వార్తలను కిమ్స్ యాజమాన్యం తీవ్రంగా ఖండించింది. తాము టెండర్లలో పాల్గొనలేదని, వస్తున్న వార్తలన్నీ అవాస్తవమని తేల్చిచెప్పింది. కిమ్స్ ప్రకటనతో ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం పిలిచిన టెండర్లలో మార్కాపురం, మదనపల్లె, పులివెందుల మెడికల్ కాలేజీలకు ఒక్క బిడ్ కూడా దాఖలు కాలేదు. ఇప్పుడు ఆదోనికి వచ్చింది కూడా సంస్థాగత బిడ్ కాదని తేలింది.

# ఢిల్లీ హైకోర్టులో పవన్‌కు ఊరట



**అమరావతి, పతాకం న్యూస్:** టాలీవుడ్ పవర్ స్టార్, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఢిల్లీ హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఆయన పేరు, చిత్రం, గొంతు, వ్యక్తిగత గుర్తింపులను ఎలాంటి అనుమతి లేకుండా వాణిజ్య ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేయకుండా పలు ఆన్‌లైన్ సంస్థలు, ఏఐ ప్లాట్‌ఫారమ్‌లు, వెబ్‌సైట్లపై మధ్యంతర ఉత్తర్వులు (యాడ్-ఇంటరిమ్ ఇంజంక్షన్) జారీ చేసింది. తన వ్యక్తిగత, ప్రచార హక్కులకు (పర్సనాలిటీ అండ్ పబ్లిసిటీ రైట్స్) భంగం కలుగుతోందని ఆరోపిస్తూ పవన్ కల్యాణ్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ మన్మీత్ ప్రీతమ్ సింగ్ అరోరాతో కూడిన ఏకసభ్య ధర్మాసనం ఈ ఎక్స్‌పార్టీ ఆదేశాలు ఇచ్చింది. మూడు దశాబ్దాలుగా సినీ, రాజకీయ రంగాల్లో ఉన్న పవన్ కల్యాణ్‌కు గణనీయమైన వాణిజ్య బ్రాండ్ విలువ ఉందని, ఆయన వ్యక్తిగత హక్కులను కాపాడాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. పలు సంస్థలు పవన్ కల్యాణ్ అనుమతి లేకుండా ఆయన ఫొటోలతో టీ-షర్టులు, కప్పులు, పోస్టర్లు వంటివి అమ్ముతున్నాయని, ఏఐ టూల్స్ ద్వారా ఆయన గొంతు, ఫొటోలను వాడుతున్నారని, సోషల్ మీడియాలో ఫేక్ పేజీలు నిర్వహిస్తున్నారని పవన్ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనివల్ల పవన్‌కు పూడ్చలేని నష్టం వాటిల్లుతుందని ధర్మాసనం పేర్కొంది. ఈ నేపథ్యంలో ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, మీషో వంటి ఈ-కామర్స్ వేదికల నుంచి అలాంటి ఉత్పత్తులను తక్షణమే తొలగించాలని ఆదేశించింది. వాటిని అమ్ముతున్న విక్రయదారుల కేవైసీ వివరాలను పిటిషనర్‌కు అందించాలని సూచించింది. పవన్ పేరును దుర్వినియోగం చేస్తున్న వెబ్‌సైట్ లింకులను వారం రోజుల్లోగా తొలగించాలని స్పష్టం చేసింది.



## నత్తనడకన 'హైదరాబాద్-విజయవాడ' రహదారి పనులు

5లో



## సంక్రాంతికి మరిన్ని ప్రత్యేక రైళ్లు..

5లో

## రూ.అరకోటి విలువైన

# భూమి హాంఫట్?



3లో



## సంతాన లేమి సమస్యలకు కారణాలేంటి?

6లో


పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా.. అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా.. పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## వలస జీవులు

పౌరసత్వం అనేది సాధారణంగా ఒక వ్యక్తి నిర్దిష్ట భూభాగంలో నివసించడంతో అనుసంధానించబడింది. పౌరుడు సాధారణంగా ఒక నిర్దిష్ట ప్రాంతంలో నివసిస్తూ ఉంటాడని భావిస్తారు. కానీ అంతర్జాతీయంగా గానీ, దేశం లోపల గానీ సరిహద్దులు దాటి ప్రజలు వలస వెళ్లడం వల్ల పౌరసత్వం-భూభాగం మధ్య ఉన్న ఈ అనుసంధానం సడలిపోతోంది. దీనితో పౌరసత్వం పట్ల ఉన్న మౌలిక అవగాహనలో గందరగోళం ఏర్పడుతోంది. ప్రభుత్వాలు గానీ, రాజకీయ పార్టీలు గానీ దీనిని పూర్తిగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా లేవు. ఫలితంగా, ప్రపంచవ్యాప్తంగా ఇటీవల వలసదారులకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని మలిచేం దుకు, భారీగా నిర్బంధ బహిష్కరణలకు పూనుకోవడం, ఓటర్ల జాబితాలను ప్రక్షాళన చేయడం వంటి ప్రక్రియలు ఊపందుకున్నాయి. భారతదేశంలో, ఎన్నికల కమిషన్ (ఇసిఐ) ఓటర్ల జాబితాలపై ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) చేపడుతోంది. ఈ ప్రక్రియను సవాల్ చెయ్యడంతో ఇసిఐ సుప్రీంకోర్టుకు ఇలా తెలిపింది: "వేగవంతమైన పట్టణీకరణ, విద్య, జీవనోపాధి తదితర అవసరాల కోసం ప్రజలు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరచూ వలస వెళ్లడం ఇప్పుడు అత్యంత సాధారణంగా మారింది. కొందరు ఓటర్లు ఒక చోట నమోదు చేసుకుని, తరువాత తమ పేర్లు అక్కడి ఓటర్ల జాబితా నుంచి తొలగించుకోకుండా మరోచోటకు మారి మళ్లీ అక్కడ నమోదు చేసుకుంటున్నారు. దీనివల్ల ఓటర్ల జాబితాలో పేర్లు పునరావృతం అయ్యే అవకాశాలు పెరిగాయి. అందువల్ల బీహార్‌తో ప్రారంభించిన ఎస్ఐఆర్ ను పాన్-ఇండియా స్థాయిలో నిర్వహించాల్సిన అవసరం ఉందని ఇసిఐ నిర్ణయించింది." అమెరికాలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాలనలో, ఫెడరల్ ఎన్నికల చట్టాలను అమలు చేయడానికి పూర్తి ఓటరు జాబితాలు అవసరమని వాదిస్తూ న్యాయ శాఖ దేశంలోని 50 రాష్ట్రాల నుంచి ఓటరు నమోదు డేటాబేస్‌లను ఇవ్వాలని కోరింది. ఈ ఆదేశాలను అనేక రాష్ట్రాలు ప్రతిఘటించాయి. ఇదే సమయంలో, అమెరికా పౌరసత్వానికి సంబంధించిన పాస్‌పోర్ట్ లేదా జనన సర్టిఫికెట్ వంటి పత్రాల ఆధారాలు తప్పనిసరి చేసేలా ఫెడరల్ ఎన్నికల విధానాలను మార్చాలని ట్రంప్ ఒక విస్తృత కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం చేశారు. దీని మూలంగా ఎన్నికల సమగ్రత, విశ్వసనీయత బలపడుతుందని అనుకూలురు వాదిస్తుండగా, విమర్శకులు మాత్రం రాష్ట్రాల స్వయంప్రతిపత్తి దెబ్బ తింటుందని, ఓటర్ల హక్కులు పరిమితం అవుతాయని హెచ్చరిస్తున్నారు. అమెరికాలో చట్టబద్ధంగా నివసిస్తున్న విదేశీయులు (పౌరులు కానివారు) సుమారు 2.2-2.4 కోట్ల మంది ఉన్నారు. అక్రమ వలసదారుల సంఖ్య అంచనాల ప్రకారం మిలియన్లలో ఉంది. భారత్, అమెరికా రెండింటిలోనూ 'విదేశీ ఓటర్లు' రాజకీయాలను ప్రభావితం చేస్తున్నారనే భావన బలంగా ప్రచారంలో పెట్టారు. ప్రపంచ జనాభాలో అంతర్జాతీయ వలసదారుల శాతం దశాబ్దాలుగా పెద్దగా మారకపోయినా, వారి సంఖ్య మాత్రం వేగంగా పెరిగింది. 1960 నుంచి వలసదారుల శాతం సుమారు ఒక శాతం పాయింట్ మాత్రమే పెరిగిందని అంచనాలు చెబుతున్నాయి. కానీ స్వదేశం వెలుపల నివసించే వారి సంఖ్య 1990లో సుమారు 15.4 కోట్ల నుంచి 2024 మధ్య నాటికి 30 కోట్లకు పైగా పెరిగింది. అంటే కేవలం మూడు దశాబ్దాల్లో దాదాపు రెండింతలు, మొత్తం ప్రపంచ జనాభా వృద్ధి కంటే వేగంగా పెరిగింది. పాశ్చాత్య దేశాల్లో స్థిరపడిన విదేశీయుల సంతానం వాటా పెరగడంతో స్థానికతవాదం పెరుగుతోంది. అమెరికా జనాభాలో విదేశాల్లో పుట్టినవారు సుమారు 14-15 శాతం ఉండగా, 2010లో ఇది సుమారు 13 శాతం మాత్రమే. యునైటెడ్ కింగ్‌డమ్‌లో ఈ మార్పు మరింత గణనీయంగా ఉంది. 2001లో సుమారు 8 శాతంగా ఉన్న విదేశాల్లో జన్మించిన వారి వాటా% 2021 నాటికి దాదాపు 16 శాతానికి పెరిగింది. పెద్ద ఆర్థిక వ్యవస్థలలో ఒకటైన కెనడాలో ఈ శాతం సుమారు 22 శాతంగా ఉంది. ఆస్ట్రేలియాలో అయితే దాదాపు 31-32 శాతం జనాభా విదేశాల్లో పుట్టినవారే. 2025 నాటికి అభివృద్ధి చెందిన దేశాల్లో ఓటర్లకు ఎదురయ్యే ముఖ్యమైన మూడు అంశాల్లో వలస ఒకటిగా ఉంటుంది, అయితే దాని తీవ్రత కొంత తగ్గింది. 1ప్రభుత్వాలు ప్రజల వలసలను నియంత్రించాలని భావిస్తున్నాయి. భారత్ 'మానవ వనరులను ఎగుమతి చేయాలని' (అంటే ఉద్యోగాల కోసం మరింత మందిని విదేశాలకు పంపాలని) ఆశిస్తోంది. యువ కార్మికుల సేవలు అవసరమైన ధనిక దేశాలు, వారు అక్కడే ఉండి పౌరసత్వం పొందకుండానే, కొన్నేళ్ల తర్వాత తిరిగి వెళ్లిపోవాలని కోరుకుంటున్నాయి. తిరిగి వచ్చే వలసదారులు కొత్త సామాజిక, రాజకీయ దృక్పథాలను తీసుకు వస్తారు. ఆతిథ్య దేశాల్లో వారు రాజకీయ హక్కులు లేని కార్మిక వర్గంగా, అమెరికా లోని హెచ్-1బి వీసా కార్మికుల మాదిరిగా, మారతారు. అయితే వారికి సమీప భవిష్యత్తులో పౌరసత్వం పొందే మార్గం ఉంటుంది. గల్ఫ్ సహకార మండలి (జిసిసి) దేశాలు, సింగపూర్‌లు కూడా రాజకీయ అస్తిత్వం లేని కార్మిక వర్గాన్ని సృష్టించాయి. అభివృద్ధి చెందిన దేశాలు కూడా తాత్కాలిక కార్మికుల విషయంలో ఇదే దిశగా ఆలోచిస్తున్నాయి.

## విద్యార్థులు దేశాన్ని లీడ్ చేయాలి: భువనేశ్వరి



**అమరావతి, పతాకం న్యూస్:** విద్యార్థులు సమాజాన్ని, దేశాన్ని లీడ్ చేసేలా ఉండాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి వ్యాఖ్యానించారు. స్కూల్ చదువు పూర్తి చేసుకుని బయటకు వచ్చే సమయంలో జీవితంలో ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. శుక్రవారం నిమ్మకూరులోని గురుకుల పాఠశాలలో విద్యార్థులతో భువనేశ్వరి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక సూచనలు చేశారు. ముందుగా గురుకుల పాఠశాల ప్రాంగణంలో.... రూ.3.50కోట్ల పూర్వ విద్యార్థుల విరాళాలతో నిర్మించిన హాస్టల్ భవనాన్ని ప్రారంభించారు. విద్యార్థులతో తన బాల్య స్మృతులను పంచుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు భువనేశ్వరి. విద్యార్థులు ఆంగ్లంలో ప్రతిభ కనబర్చేలా అధ్యాపకులు చూడాలని సూచించారు. తానూ నిమ్మకూరు రావడం స్వీట్ మెమరీ అని.. ఇది మా తాత లక్ష్మయ్య ఊరని చెప్పుకొచ్చారు. చిన్నప్పుడు సెలవులు వస్తే అమ్మ, తమను నిమ్మకూరు పంపించేదని అన్నారు. వేసవి సెలవులకు ఇక్కడికే వచ్చే వాళ్లమని, ఇక్కడ తన సోదరితో కాలక్షేపం చేశానని నారా భువనేశ్వరి గుర్తుచేసుకున్నారు.

## వేల మామిడిలో కొత్త పంచాయితీ ఏర్పాటు చేయాలి




**అనంతగిరి, పతాకం న్యూస్:** అల్లూరి జిల్లా, అనంత గిరి మండలం లోని పెద కోట పంచాయితీ నుండి విభజించి, వేల మామిడి గ్రామం లో కొత్త పంచాయితీ ఏర్పాటు చేయాలనీ ఐటీడీఏ లో...ఆ ప్రాంత గిరిజనులు వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండల రావు ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. అనంతరం ఐటీడీఏ గ్రీవెన్స్ లో... డీ ఆర్ ఓ అంబేద్కర్, డీఎల్ పీఓ కుమార్ లకు దరఖాస్తు తో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో..హుకుంపేట వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండల రావు మాట్లాడు తూ అనంత గిరి మండలం, పెద కోట పంచాయితీ, నీ విభజన చేసి వేల మామిడి లో కొత్త పంచాయితీ ఏర్పాటు చేయాలనీ కోరారు. 13 గ్రామాల ప్రజలు పంచాయితీ కేంద్రానికి వెళ్లాలంటే... ఒక వైపు 45 నుండి 50 కిలోమీటర్లు, ఇరువైపులా సుమారు గా 90 నుండి 100 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి ఉంటుందనీ ఆవేదన వ్యక్తం చేశారు.స్థానిక గిరిజనులు సీదరి సిద్ధూ, పాడి కవిత లు మాట్లాడు తూ 13 గ్రామాలు, 2500 జనాభా, 1512 ఓటర్లు కలిగి ఉన్నామని, పంచాయితీ ఎన్నికలు, ఎంపీటీసీ ఎన్నికల్లో పంచాయితీ కేంద్రం కు వెళుతూ. ప్రమాదాలు జరిగి అనేకమంది మృత్యువాత పడ్డారని, కొందరు వికలాంగులు గా మారారనీ చెప్పారు. అన్నీ అర్హతలు ఉన్న వేల మామిడి గ్రామం లో పంచాయితీ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమం లో కిల్లో సత్యం, సీదరి సుబ్బు, కొత్త పల్లి లక్ష్మయ్య, సీదరి శంకర్, పూజారి లక్ష్మణ్ రావు, నాగేశ్వరరావు, పాడి కవిత, సీదరి సిద్ధు, కాదెల అనూష్, పాతుని వేణు గోపాల్,పాడి కొండలరావు, రామా రావు, పొగరు అప్పా రావు, దేముడు,సీదరి సాంబ, సీసా పండన్న, అప్పన్న, హేమంత్,ఉల్లి నాగేష్, పెద్ద సంఖ్యలో 13 గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## మన్యంలో పర్యాటకుల సందడి



**పాడేరు, పతాకం న్యూస్:** మన్యంలోని సందర్శనీయ ప్రదేశాల్లో పర్యాటకుల సందడి నెలకొంది. వాతావారణం అనుకూలించడంతో పాటు క్రిస్మస్ సెలవులు కావడంతో అధిక సంఖ్యలో పర్యాటకులు ఏజెన్సీ ప్రాంతానికి వచ్చారు. దీంతో గురువారం ఏజెన్సీలో ఎక్కడ చూసినా సందర్శకుల కోలాహలం కనిపించింది. అనంతగిరి మండలంలో బొర్రా గుహలు మొదలుకుని చింతపల్లి మండలం లంబసింగి వరకు సందడి నెలకొంది. బొర్రా గుహలు, కటికి, తాడిగుడ జలపాతాలు, అరకులోయ మండలంలో మాడగడ మేఘాల కొండ, గిరిజన మ్యూజియం, పద్మాపురం ఉద్యానవనం, డుంబ్రిగుడ మండలంలోని చాపరాయి గెడ్డ, పాడేరు మండలంలో మోదాపల్లి కాఫీ తోటలు, వంజంగి హిల్స్, జి.మాడుగుల మండలంలోని కొత్తపల్లి జలపాతం, చింతపల్లి మండలంలో తాజంగి రిజర్వాయర్, చెరువువేనం మేఘాల కొండ, లంబసింగి ప్రాంతాల్లో పర్యాటకుల రద్దీ నెలకొంది. దీంతో అరకులోయ, పాడేరు, లంబసింగి ప్రాంతాల్లో పర్యాటకుల హడావిడి కనిపించింది. అరకులోయలోని స్థానిక పద్మాపురం గార్డెన్, గిరిజన మ్యూజియానికి గురువారం పర్యాటకులు పోటెత్తారు. సందర్శకులు అధికంగా రావడంతో రాత్రి అయినప్పటికి నిర్వాహకులు అనుమతించారు. అలాగే వేకువజామున మాడగడ సన్‌రైజ్ వ్యూపాయింట్‌ను అధిక సంఖ్యలో పర్యాటకులు సందర్శించారు. గాలికొండ వ్యూపాయింట్, సుంకరమెట్ట కాఫీ తోటల్లో ఏర్పాటు చేసిన ఉడెన్ బ్రిడ్జి వద్ద రద్దీ నెలకొంది. ఇక్కడ ట్రాఫిక్ స్తంభించిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. డుంబ్రిగుడ మండలంలోని పర్యాటక కేంద్రమైన చాపరాయి జలవిహారికి అధిక సంఖ్యలో పర్యాటకులు వచ్చారు. ఉదయం నుంచి ఇక్కడ సందడి నెలకొంది. జల విహారిలో స్నానాలు చేస్తూ ఉల్లాసంగా గడిపారు. గిరిజన సంప్రదాయ దుస్తులు ధరించడంతో పాటు థింసా నృత్యాలు చేస్తూ పలువుర పర్యాటకులు ఎంజాయ్ చేశారు.

## 'జెన్-జీపై నాకు గొప్ప నమ్మకముంది.. మీరు దేశాభివృద్ధికి కృషి చేయాలి : మోడీ



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** జెన్-జీ సామర్థ్యాలను, ఆత్మవిశ్వాసాన్ని చూస్తున్నానని, వారు కష్టపడి పనిచేసి, క్రమశిక్షణతో దేశాభివృద్ధికి కృషి చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. తద్వారా వికసిత్ భారత్ లక్ష్యాన్ని నెరవేర్చాలని సూచించారు. యువతకు వివిధ రంగాల్లో అపారమైన అవకాశాలు ఉన్నాయని అన్నారు. శుక్రవారం 'వీర్ బాల్ దివస్' సందర్భంగా జరిగిన జాతీయ కార్యక్రమంలో ప్రధాని మోదీ ఈ మేరకు యువతను ప్రోత్సహించారు. వయస్సుతో సంబంధం లేకుండా పెద్ద సవాళ్లను ఎదుర్కోవాలని మోదీ యువతకు సలహా ఇచ్చారు. "మీరు అందరూ జెన్-జీ, జెన్-ఆల్ఫా తరంవారు. మీ తరం భారత్‌ను అభివృద్ధి చెందిన దేశం అనే లక్ష్యం వైపు తీసుకువెళ్తుంది. నేను జెన్-జీ సామర్థ్యాలను, ఆత్మవిశ్వాసాన్ని చూస్తున్నాను. వారిని అర్థం చేసుకుంటున్నాను. మీకు నాకు గొప్ప నమ్మకం ఉంది. ఎవరు చిన్నవారు, ఎవరు పెద్దవారు అనేది వయస్సు నిర్ణయించదు. మీరు చేసే పనులు, సాధించే విజయాల ఆధారంగా గొప్పవారు అవుతారు. మీరు వయస్సులో చిన్నవారు అయినప్పటికీ, ఇతరులు మీ నుంచి స్ఫూర్తి పొందేలా మీరు పని చేయగలరు." అని ప్రధాని మోడీ తెలిపారు. స్వల్పకాలిక ప్రజాదరణ (పాపులారిటీ) వల్ల యువత పరధ్యానానికి గురికావద్దని ప్రధాని మోదీ సలహా ఇచ్చారు. దేశ నిర్మాణానికి సహకరించిన మహానుభావుల నుంచి, గొప్ప వ్యక్తుల నుంచి ఆదర్శాలను, మంచి విషయాలను నేర్చుకోవాలని సూచించారు. తమ విజయాన్ని తమకే పరిమితం చేసుకోకుండా, దేశ విజయంగా మార్చడమే లక్ష్యంగా పని చేయాలని చెప్పారు.ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో అనేక కార్యక్రమాలను చేపట్టి దేశంలోని నిరాశ, నిస్సహాయత వాతావరణాన్ని రూపుమాపిందని, ఇప్పుడు యువతకు ప్రతి రంగంలో పురోగతి సాధించడానికి అవకాశం ఏర్పడిందని మోడీ అన్నారు. గతంలో యువత కలలు కనడానికి కూడా భయపడేవారు. ఎందుకంటే పాత వ్యవస్థలు మంచి ది ఏదీ జరగదనే వాతావరణాన్ని సృష్టించాయి. అప్పట్లో ప్రతి చోట నిరాశ, నిస్సహాయత నెలకొని ఉండేది. కష్టపడి పనిచేయడం వల్ల కలిగే ప్రయోజనం ఏమిటని ప్రజలు ఆలోచించారు. కానీ నేడు పరిస్థితి మారింది. నేడు మన దేశం ప్రతిభను వెతికి పట్టుకుని, వారికి సరైన వేదికను అందిస్తోంది. 140 కోట్ల దేశ ప్రజల బలం వారి కలల వెనుక ఉందని మోడీ అన్నారు. 'డిజిటల్ ఇండియా విజయంతో, ప్రజలకు ఇంటర్నెట్ అనే శక్తి అందుబాటులోకి వచ్చింది. నేడు మీరు నేర్చుకోవడానికి కావాల్సిన వనరలు ఉన్నాయి. సైన్స్?, టెక్నాలజీ, స్టార్టప్ రంగాల్లో ప్రవేశించాలని అనుకునేవారికి స్టార్టప్ ఇండియా లాంటి మిషన్లు ఉన్నాయి. క్రీడల్లో రాణించాలని అనుకునేవారికి ఖేలో ఇండియా మిషన్ ఉంది' అని మోడీ అన్నారు. వీర్ సాహిబ్జాదాలను ప్రస్తావిస్తూ, వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని, యువత పెద్ద పెద్ద కలలు కనాలని, కష్టపడి పనిచేయాలని, తమ ఆత్మవిశ్వాసాన్ని ఎప్పుడూ సడలనివ్వకూడదని మోదీ సూచించారు. యువత భవిష్యత్ ఉజ్వలంగా ఉంటేనే భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని, వారి ధైర్యం, ప్రతిభ, అంకిత భావం దేశ ప్రగతికి మార్గనిర్దేశం చేస్తాయని మోడీ అన్నారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది పిల్లలు అటల్ టింకరింగ్ ల్యాబ్స్?లో ఆవిష్కరణలు, పరిశోధనల్లో నిమగ్నమై ఉన్నారని మోదీ అన్నారు. పాఠశాల విద్యార్థులకు రోబోటిక్స్, ఏఐ, సుస్థిరత, డిజైన్ థింకింగ్ పరిచయం చేస్తున్నారని చెప్పారు. ఈ ప్రయత్నాలతో పాటు, జాతీయ విద్యా విధానం మాతృభాషలో విద్యను అభ్యసించే అవకాశాన్ని కల్పిస్తోందన్నారు. దీని వల్ల పిల్లలు సులభంగా పాఠాలను అర్థం చేసుకోగలుగుతారని చెప్పారు.

## నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కెఎస్ఎన్ రాజు



**చోడవరం, పతాకం న్యూస్ :** నూతన సంవత్సరాన్ని పురస్కరిం చుకొని 2026 సంవత్సరానికి సంబంధించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను చోడవరం శాసనసభ్యులు కె.ఎస్.ఎన్.ఎస్ రాజు చోడవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సకురు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ముద్రించిన 5,500 నూతన సంవత్సర క్యాలెండర్ ప్రతులను ఎమ్మెల్యే విడుదల చేశారు. ఈ క్యాలెండర్లు చోడవరం గ్రామపంచాయతీ పరిధిలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన ఎమ్మెల్యే, పార్టీ కోసం అంకితభావంతో సేవలందిస్తున్న కార్యకర్తల కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సిఐటియు అఖిల భారత బహిరంగ సభను జయప్రదం చేయండి : సిఐటియు గనిశెట్టి పిలుపు

**పరవాడ, పతాకం న్యూస్:** సిఐటియు అఖిల భారత మహాసభలు జయప్రదం చేయాలని, జనవరి 4న విశాఖపట్నంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. పరవాడ మండలం, ఫార్మసిటీలో శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందరరేగాసిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిశెట్టి మాట్లాడుతూ సిఐటియు 18వ అఖిలభారత మహాసభలు జయప్రదం చేయండి. డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు సిఐటియు అఖిలభారత మహాసభలు విశాఖపట్నం వేదిక కానున్నాయని సిఐటియు ఆవిరవించి 55 సంవత్సరాల కాలంలో మొదటిసారి ఆంధ్రప్రదేశ్లో విశాఖపట్నం మహాసభలకు వేదిక కానున్నదని. ఈ మహాసభలకు 2000 మంది ప్రతినిధులు అన్ని రాష్ట్రాల నుండి, కేంద్రపాలిత ప్రాంతాల నుండి హాజరవుతారని. ఈ మహాసభల్లో కేంద్ర బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా చర్చించి భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం అవుతారని, కేంద్ర బిజెపి ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ కార్మిక వర్గానికి తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని, బయటికి మేడిపండులా ఉన్న ఈ చట్టం లోపల కార్పొరేట్ కంపెనీలకి అనుకూలమైన విధానాల్ని అమలు చేస్తున్నారని. ఇప్పటివరకు ఉన్న హక్కుల్ని కాలరాస్తున్నారన్నారు. ఈనేపథ్యంలో జరుగు మహాసభల్లో ముగింపుగా జనవరి 4న భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారని, ఈ మహాసభలు జయప్రదానికి కార్మికులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

# సిఐటియు అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలంటూ బైక్ ర్యాలీ



**అరకులోయ, పతాకం న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకులోయ ప్రాంతంలో సిఐటియు జిల్లా కోశాధికారి పోతురాజు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల జీతాలను పెంచడం లేదని, జీవితాంతం పని చేసిన వారిని పర్మనెంట్ చేయడం లేదని ఆరోపించారు. బ్రిటిష్ కాలం నాటి నుంచి సాధించుకున్న కార్మిక హక్కులను కాపాడుకోవాలని లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే జనవరి 4న విశాఖపట్నంలో జరగనున్న సిఐటియు అఖిలభారత మహాసభలలో బహిరంగ సభకు వేలాదిగా తరలి వచ్చి, లక్షలాది మంది కార్మికులతో మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ బైక్ ర్యాలీలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి జె భగత్ రాం, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కే రామారావు, కిల్లో జగనాథం, బి ధశరథ్, రాజు, కె అర్జున్ డొంబు, వి ప్రసాద్ పాల్గొన్నారు.

# రూ.అరకోటి విలువైన భూమి హాంఫట్?

- కలిపేసుకుని దర్జాగా లేఅవుట్ వేస్తున్నా, రియల్టర్‌ను పట్టించుకోని అధికారులు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన కొండుపాలెం గ్రామస్థులు



**అనకాపల్లి, పతాకం న్యూస్:** జిల్లా కేంద్రం అనకాపల్లి పరిసరాల్లో భూముల ధరలు పెరుగుతుండడంతో అక్రమార్కుల కన్ను ప్రభుత్వ భూములపై పడింది. కొండ వాగులు, గోర్జ భూములను సైతం వదలడం లేదు. అక్రమార్కులు ప్రభుత్వ భూములను కలిపేసుకుని మరీ లేఅవుట్లు వేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అనకాపల్లి మండలంలోని కొండుపాలెం రెవెన్యూ పరిధి సర్వే నంబరు 55 సబ్ డివిజన్ 31లో గల సుమారు 58 సెంట్ల గోర్జ భూమి మీదుగా ఎన్నో ఏళ్లుగా గ్రామ రైతులు పొలం పనుల కోసం రాకపోకలు సాగిస్తున్నారు. అనకాపల్లి జిల్లా కేంద్రం కావడం, దీనికి తోడు జాతీయ రహదారికి, కలెక్టరేట్ కార్యాలయానికి సమీపంలో కొండుపాలెం గ్రామం ఉండడంతో ఇక్కడ భూముల ధరలు అమాంతం పెరిగిపోయాయి. మార్కెట్ ధర సెంటు రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ధర పలుకుతోంది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొండుపాలెం పరిసరాల్లోని రైతుల నుంచి భూములను పెద్దఎత్తున కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల అదే గ్రామంలో సర్వే నంబరు 50, 55లలో కొన్ని సబ్ డివిజన్‌లకు చెందిన భూములను ఒక రియల్టర్ రైతుల నుంచి కొనుగోలు చేశారు. ఇటీవల అక్కడ లేఅవుట్ పనులు ప్రారంభించారు. అయితే సర్వే నంబరు 55లోని 31వ సబ్ డివిజన్‌లో గల గోర్జభూమిగా రెవెన్యూ రికార్డుల్లో నమోదైన సుమారు 58 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని లేఅవుట్‌లో కలుపుకొని దర్జాగా వెంచర్ పనులు కానిచ్చేస్తున్నారు. కాగా తమ పూర్వీకుల కాలం నుంచి ఈ గోర్జభూమి మీదుగా పంట పొలాలకు రాకపోకలు సాగిస్తున్నామని, దాన్ని ఎలా ఆక్రమిస్తారని రియల్టర్‌ను కొండుపాలెం గ్రామస్థులు ప్రశ్నించినా ఫలితం లేకపోయింది. సుమారు అరకోటి విలువ చేసే ఈ గోర్జ భూమిని రియల్టర్ చదును చేసి లేఅవుట్‌లో కలిపేశారని కలెక్టర్‌కు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. దీనిపై ఇక్కడి అధికారులు స్పందించకపోతే సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లకు ఫిర్యాదు చేస్తామని స్థానికులు చెబుతున్నారు.

# బస్కి పంచాయతీ నిధుల దుర్వినియోగంపై వెంటనే విచారణ చేయాలి : సీపీఎం డిమాండ్



**అరకులోయ, పతాకం న్యూస్ :** మండల కేంద్రంలోని బస్కి గ్రామ పంచాయతీలో 15వ ఆర్థిక సంఘం నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ చేపట్టాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం విలేకరుల సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు, బురిడీ దశరథ్ మాట్లాడారు. బస్కి వైసీపీ సర్పంచ్ పాడి రమేష్ అభివృద్ధి పేరుతో పంచాయతీ నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. సుమారు 31 లక్షల రూపాయలకు పైగా నిధులు దుర్వినియోగమైనట్టు తెలిపారు. డిసెంబర్ 5న పాడేరు 'స్పందన – మీ కోసం' కార్యక్రమంలో క్లాప్ మిత్రలు, పంచాయతీ ప్రజలు సిపిఎం ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారని, అప్పటి డిపిఓ వెంటనే విచారణ చేపడతామని హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. మండల అభివృద్ధి అధికారికి కూడా ఫిర్యాదు వివరాలు తెలియజేయలేదన్నారు. పని చేసిన క్లాప్ మిత్రలకు కూలి చెల్లించకుండానే నిధులు డ్రా చేసి ప్రజల సొమ్మును దుర్వినియోగం చేశారని, ఆధారాలతో సహా స్పందనకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఫిర్యాదుకు ఫలితం లేకపోవడంతో పంచాయతీరాజ్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని, అవినీతిపై చర్యలు తీసుకోకపోతే పంచాయతీ కార్యాలయం ముట్టడి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ప్రజలు, క్లాప్ మిత్రలు ఆందోళనకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. అభివృద్ధి కోసం కేటాయించిన నిధులను అధికార దుర్వినియోగం చేశారని, పంచాయతీలో విద్యుత్ స్తంభాలకు బల్బులు కూడా వేయలేదని, రిపేర్ల పేరుతో ఒకటికి రెండు, మూడు సార్లు డబ్బులు డ్రా చేశారని ఆరోపించారు. తక్షణం సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# మల్కాపురం 61వ వార్డులో సామాజిక సేవలకు ఊపిరి






**మల్కాపురం, పతాకం న్యూస్:** మల్కాపురం 61వ వార్డులో ఎల్లప్పుడూ సోషల్ సర్వీసెస్ కార్యకలాపాల్లో కీలక పాత్ర పోషిస్తు, వార్డు నాయకులురాలు భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించి ఈ కార్యక్రమం 61వార్డులోని ప్రకాష్ నగర్ గ్రంథాలయం, పల్లి వీధి కమ్యూనిటీ హాల్, మరియు వెంకన్నపాలెం కృష్ణ ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. కార్య క్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సింహాచలం,వార్డు టీడీపీ అధ్యక్షులు మజ్జి సోమేశ్, వార్డు మహిళా అధ్యక్షురాలు సర్వసిద్ధి శ్రీలక్ష్మీ హాజరై కార్యక్రమాన్ని విజయవంతంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, ఎన్ఎస్ఎస్ ద్వారా జరిగే సర్వేలు సమాజ అభివృద్ధికి ఎంతో ఉపయోగకరమని, విద్యార్థులు సామాజిక బాధ్యతను తెలుసుకునేందుకు ఇవి దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్పి నిర్మల, విద్యార్థులు,మహిళలు, పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అధ్వానంగా రహదారులు



**సీలేరు, పతాకం న్యూస్:** నాణ్యతా లోపంతో జిల్లాలోని పలు రహదారులు ఐదేళ్ల లోపు అధ్వానంగా తయారయ్యాయి. ముఖ్యంగా జీకేవీధి మండలం గాలికొండ పంచాయతీ పరిధి సప్పర్ల నుంచి గాలికొండ వెళ్లే రహదారి, అలాగే అనంతగిరి మండలంలోని భీసుపురం నుంచి బిర్జిగూడ వెళ్లే రోడ్డు దెబ్బతిన్నది. దీంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. జీకేవీధి మండలం గాలికొండ పంచాయతీ పరిధి సప్పర్ల నుంచి గాలికొండ వరకు వెళ్లే రోడ్డు నిర్మించి ఐదేళ్లు పూర్తి కాకుండానే రాళ్లు తేలి దారుణంగా తయారైంది. అలాగే గాలికొండ గ్రామ సమీపాన వంతెన వద్ద రోడ్డు అంచు కోతకు గురైంది. కొద్ది రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు ఇక్కడ రంధ్రం ఏర్పడడంతో వాహనదారులు అప్రమత్తంగా ఉండకపోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గ్రామస్థులు చెబుతున్నారు. అధికారులు స్పందించి వంతెన వద్ద రంధ్రాన్ని పూడ్చడంతో పాటు రహదారికి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. అనంతగిరి మండలంలోని ఎగువశోభ పంచాయతీలో గత ప్రభుత్వ హయాంలో ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన కింద భీసుపురం నుంచి బిర్జిగూడ వరకు సుమారు 6 కిలోమీటర్ల మేర రూ.6.18 కోట్లతో రింగురోడ్డు నిర్మించారు. అయితే ఆ తరువాత మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు ఈ రోడ్డు దారుణంగా తయారైంది. అలాగే పూలుగుడ, దిగువశోభ సమీపంలో రోడ్డు పూర్తిగా కోతకు గురైంది. దీంతో బిర్జిగూడ, సరసపోదోర్, పోర్నపోదర్, దిగువశోభ, ఎగువశోభ, పూలుగుడ గ్రామాల గిరిజనులు నరకం చూస్తున్నారు. బొర్రా వైపు నుంచి బిర్జిగూడ వరకు రైల్వే టన్నెల్ పనుల కారణంగా భారీ లోడ్‌లతో లారీలు వెళ్లడంతో రోడ్డంతా దెబ్బతింది. సరసపోదోర్, పోర్ణపోదోర్, దిగువశోభ నుంచి ఎగువశోభ వరకు రోడ్డు అధ్వానంగా మారింది. పూలుగుడ నుంచి భీసుపురం వరకు రోడ్డు కోతకు గురైంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# ముషిడిపల్లి రెవెన్యూ భూ సమస్యపై ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తిని కలిసిన ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీ ప్రతినిధులు



**దేవరాపల్లి, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా,దేవరాపల్లి మండలంలో గల మషిడిపల్లి రెవిన్యూ కె.యం.పాలెం గ్రామానికి చెందిన దళిత బాధితుడు కణితి అర్జునరావు భూమిసమస్య పై రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ సూచన మేరకు అనకాపల్లి జిల్లా ఎమ్మార్పీఎస్, జిల్లా కమిటీ నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి స్వగ్రామం వెన్నలపాలెంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీ బృందం ముషిడిపల్లి రెవెన్యూ భూమి సమస్యపై కూలంకుశంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రతినిధులుతో మాట్లాడుతూ ఈ భూసమస్యపై సానుకూలంగా స్పందించి సంబందిత రెవిన్యూ మండలతహశీల్దార్ తో మాట్లాడానని త్వరలోమషిడిపల్లి భూమి సమస్య పరిష్కరించాలని తహశీల్దార్ లక్ష్మీదేవి కు ఆదేశాలు జారీ చేసానని ఆయన ఎమ్మార్పీఎస్ ప్రతినిధులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా ప్రతినిధులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో భూమి బాధితుడు కణితి అర్జునరావు కుటుంబంతోపాటు అనకాపల్లి జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఎలకామల్లిబాబు, జిల్లా నాయకులు కొల్లి చిన అప్పారావు,మాడుగుల నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ నాయకులు ఎలుచూరి గాటిలు, చోడవరం నియోజకవర్గం ఎంఎస్ పినాయకులు మంజేటిరాజాబాబు,పరవాడ మండల ఎమ్మార్పీఎస్ నాయకులు ఈతపాకల అప్పలరాజు, కాకినాడ పరమేశ్వరరావు, ఁ ఽ.కోటపాడు మండల ఎమ్మార్పీఎస్ నాయకులు మారడబూడి త్రినాథ్ రావు, దేవరాపల్లి మండల యువజన నాయకులు కె.ఎర్నికుమార్, పలువురు సానుభూతి పరులు పాల్గొన్నారు..

# కళ్లను జాగ్రత్తలు కాపాడుకోవాలి: రాజు







**మల్కాపురం, పతాకం న్యూస్:** అన్ని ఇంద్రియాలలోకి కళ్ళు అత్యంత ప్రముఖమైనవని, వాటిని జాగ్రత్తగా కాపాడుకోవాలని మెడికోవర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ఎం.ఎస్.ఎల్. రాజు అన్నారు. స్థానిక 61వ, వార్డులోని పల్లి వీధిలో సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్ -1 ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా, శుక్రవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభిస్తూ- కళ్ళ సమస్యలను ఉపేక్షించకూడదని, వెంటనే డాక్టర్ ను సంప్రదించాలని అన్నారు. శిబిరంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న 61వ, వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు శ్రీ మజ్జి సోమేష్ మాట్లాడుతూ- జాతీయ సేవా పథక కార్యకర్తలు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని, ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయం అన్నారు. సమావేశంలో వార్డు మహిళా అధ్యక్షురాలు శ్రీమతి సర్వసిద్ధి శ్రీలక్ష్మి, స్థానిక మహిళా నాయకురాలు శ్రీమతి నిర్మల, ప్రముఖ వైద్యులు డాక్టర్ భాగ్యరాజు, మేడికోవర్ హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ శ్రీ అభిరామ్, జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి తదితరులు ప్రసంగించారు. అనంతరం 100 మందికి కంటి పరీక్షలను ఉచితంగా చేసి, 30 మందిని ఉచిత ఆపరేషన్లకు ఎంపిక చేశారు. 12 మంది వెంటనే ఆపరేషన్ కు వెళ్లారు. జాతీయ సేవా పథక సేవలను స్థానికులు కొనియాడారు. ప్రకాష్ నగర్ సమీపంలో గల ప్రియదర్శిని కాలనీలో డిగ్రీ కళాశాల యూనిట్ -2 ప్రత్యేక సేవా శిబిరంలోని కార్యకర్తలు వై. అనసూయ దేవి ఆధ్వర్యంలో పలు అంశాలపై సర్వేను నిర్వహించారు. డిజిటల్ లావాదేవీలపై స్థానికులకు అవగాహన కలిగించారు. వెంకన్నపాలెంలోని డిగ్రీ యూనిట్-3 కార్యకర్తలు అంజలీ దేవి నాయకత్వంలో సర్వే తో బాటుగా డిజిటల్ అక్షరాస్యతపై స్థానికులకు అవగాహన కలిగించారు. జీవ వైవిధ్యం పై బృంద చర్చలు జరిపారు. 60వ, వార్డులోని సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్- 1 మరియు యూనిట్- 2 ఆధ్వర్యంలో జవహర్ నగర్ లో మరియు ఇందిరా కాలనీలో సర్వే తో బాటు యోగా తరగతులను నిర్వహించారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడంపై బృంద చర్చలు జరిపారు. 60వ, వార్డులోని జాతీయ సేవా పథక కార్యక్రమాలను సంధ్యారాణి, నదియా నిర్వహించారు.

# 'అప్పలరాజును వెంటనే విడుదల చేయాలి లేదంటే న్యాయ పోరాటం'

**అనకాపల్లి, పతాకం న్యూస్:** అప్పలరాజును తక్షణమే విడుదల చేయాలని, లేదంటే న్యాయ పోరాటం చేస్తాం అని శ్రీనివాసరావు హెచ్చరించారు. ప్రజా ఉద్యమనేత, అనకాపల్లి జిల్లా సిపిఎం నాయకులు ఎం అప్పలరాజుపై పిడి చట్టం బనాయించి అరెస్టు చేయడంపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. శుక్రవారం అనకాపల్లి జిల్లా ధర్మవరంలో గ్రామస్తులతో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీలకతీతంగా అందరూ వచ్చి ఇది అన్యాయం అని నిరసనలు వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఇప్పటివరకు అప్పలరాజుపై తప్పుడు కేసులు పెట్టి వేధించారని అన్నారు. నేడు రాష్ట్ర అసెంబ్లీలో ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా ఉన్నవారిలో ఒక్కరు కూడా అప్పలరాజు వ్యక్తిత్వానికి సరితూగరు అని స్పష్టం చేశారు. 175 మంది ఎమ్మెల్యేలుంటే 138 మందిపై క్రిమినల్ కేసులున్నాయని గుర్తు చేశారు. అందులో 98 మంది అధికార పార్టీవారేనన్నారు. 38 మందిపై సీరియస్ కేసులు అంటే . మర్డర్లు, అత్యాచారం, స్మగ్లింగ్, డబ్బులను ఎగ్గొట్టడం వంటి కేసులు వారిపై ఉన్నాయన్నారు. స్వయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిపై 24 కేసులున్నాయని తెలిపారు. అప్పలరాజుపై ఉన్నవి 19 కేసులేననీ.. వాటిలో 11 కేసులు రద్దయ్యాయని తెలిపారు. మిగిలినవాటిలో అన్నిటినీ కొట్టేశారని చెప్పారు.

## రణస్థలంలో వాహనదారులకు

# తప్పని ఇబ్బందులు



**రణస్థలం, పతాకం న్యూస్:** హైవే విస్తరణలో భాగంగా రణస్థలంలో ఫ్లైఓవర్ పనులు చేపడుతుండడంతో ప్రధాన రహదారిని సంబంధిత అధికారులు మూసివేశారు. దీంతో సర్వీసు రోడ్లలో వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. ఇరుకు రోడ్లు కావడం, వాటిపై మట్టి, ఇసుక వంటివి పేరుకుపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఇసుక, మట్టి కారణంగా రోజంతా దుమ్ము దూళీ రేగుతుండడంతో స్థానికులతో పాటు వాహన చోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎప్పటికప్పుడు రోడ్లను నీటితో తడిపితే ఈ ఇబ్బందులు ఉండవు. కానీ, ఫ్లైఓవర్ నిర్మాణ సంస్థ దీన్ని పట్టించుకోవడం లేదు. మరోపక్క జిల్లా నుంచి విశాఖ, విజయనగరం జిల్లాలకు పెద్ద ఎత్తున ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. ప్రతిరోజూ వందలాది లారీలు, టిప్పర్లలో ఇసుకను తరలిస్తున్నారు. అయితే, వాహన సామర్థ్యానికి మించి ఇసుకను లోడ్‌చేసి దానిపై చిన్నపాటి టార్పాలిన్ కప్పి తరలిస్తుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇసుక రేణువులు వచ్చి వాహనదారులు, ప్రయాణికుల కళ్లలో పడుతున్నాయి. ఆపై హైవేపై దారిపొడవునా ఇసుక పోగులు ఉండిపోతున్నాయి. దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పండుగ సీజన్ కావడంతో మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా హైవే, జిల్లా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

## సిద్ధమవుతున్న పందెం కోళ్లు



**మదినేపల్లి, పతాకం న్యూస్:** సంక్రాంతిని పురస్కరించుకుని పండుగ మూడు రోజులు పందేలు జోరుగా నిర్వహించేందుకు ముదినేపల్లి మండలంలోని పందేల నిర్వాహకులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే గ్రామాల్లో అడపాదడపా ముసుగు కోడి పందేలు మొదలయ్యాయి. ముదినేపల్లి మండలంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని బరిలో దింపేందుకు కోడి పుంజులను భారీగా పెంచుతున్నారు. కోడి పందేల రాయుళ్లు నాలుగు నెలలుగా పుంజులను పెంచే పనిలో నిమగ్నమయ్యారు. కూటమి ప్రభుత్వం సంక్రాంతి సంబరాలకు అనుమతి ఇస్తుండటం, సంబరాల పేరుతో విచ్చలవిడిగా కోడి పందేలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. పోలీసుల భయం లేకుండా సంక్రాంతి సంబరాల్లో పందేలు వేసే అవకాశం ఉండటంతో గ్రామగ్రామాన పందెం పుంజులను భారీగా పెంచుతున్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో కోడిపందేల బరులు సిద్ధం చేసే పనుల్లో పందెంరాయుళ్లు నిమగ్నమయ్యారు. మండలంలో గురజ, పెదపాలపర్రు, పెయ్యేరులోని వైఎస్ఆర్ కాలనీ, వాడవల్లి తదితర గ్రామాల్లో ప్రత్యేకంగా షెడ్లను ఏర్పాటు చేసి కోడి పుంజులను పెంచుతున్నారు. ఒక్కో వ్యక్తి 20 నుంచి 50 పుంజులను ప్రత్యేక షెడ్డుల్లో ఉంచి పర్యవేక్షిస్తున్నాడు. ఇలా మండలంలో సుమారు 300 పుంజులు తయారవుతున్నట్లు తెలుస్తోంది. ఒక్కో పుంజు రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు ధర పలుకుతుందని నిర్వాహకులు చెబుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో కోడిపుంజుల అమ్మకాలు, కొనుగోళ్లు ఊపందుకున్నాయి. పుంజు సామర్థ్యాన్ని బట్టి రూ.ఐదు వేల నుంచి రూ.25 వేలకు పైగా ధర పలుకుతోంది. కోడిపందేలు, జూదం సాగనివ్వబోమని ఓ వైపు పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ పందేల పండుగ నిర్వహించేందుకు పందెంరాయుళ్లు ఇప్పటికే సమాయాత్తమవుతున్నారు.

ˇమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వీర్ బాల్ దివస్. పాఠశాల స్థాయి నుంచే, విద్యార్థులకు దేశభక్తిని బోధించాలి: సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ



**విశాఖపట్నం, పతాకం న్యూస్ :** కేంద్ర ప్రభుత్వ అధికారిక కార్యక్రమము వీర బాలదివస్ గురజాడ నగర్, కేవన్ కాలనీ లో ఉన్న గురుద్వారా లో శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సర్కిల్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ ముందుగా బాబా జోరవర్ సింగ్, బాబా ఫతేసింగ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నతనం నుంచే విద్యార్థులకు, పిల్లలకు ధైర్య సాహసాలు, దేశభక్తి, సత్యమునే మాట్లాడుట, నేర్పించాలని కోరారు..1704 డిసెంబర్ 26 తేదీన మొగలాయి చక్రవర్తులు వీరిని ఇస్లాం మతము స్వీకరించవలసిందిగా నిర్బంధం చేశారు, లేనిచో సజీవ సమాధి చేస్తామని హెచ్చరించిన, బాబా జోరవర్ సింగ్, బాబా ఫతేసింగ్ నిరాకరించి వారితో యుద్ధానికి తలపడ్డారు వీరి ధైర్య సాహసాలను నేటి యువతరానికి తెలియ చెయ్యటానికి ప్రధాని మోడీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వము డిసెంబర్ 26వ తేదీన అధికార పూర్వకముగా వీర బాల దివస్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ ఉత్తరాంధ్ర కన్వీనర్ సుహాసిని ఆనంద్ , విశాఖ జిల్లా కన్వీనర్ రూపాకుల రవికుమార్, కో కన్వీనర్ ఎస్ . దానేష్, చోడవరపు రాజు, కె ఎన్ పీ చక్రవర్తి, కైలాస రెడ్డి, పోతిన నానాజీ, జానకిరామ్, కనకరాజు, సంతోష్ నాయుడు, చిన్ని సింగ్, ప్రదీప్ కుమార్, , శ్రీ రామ్, రాజ్ కుమార్, కే ప్రసాద్, అవతార్ సింగ్, మోహన్ సింగ్, ప్రతాప్ సింగ్, శక్తి సింగ్, విక్రమ్ సింగ్, పిల్లు సింగ్, లక్ష్మీ కౌర్, లలితా కౌర్, అధిక సంఖ్యలో స్థానికులు పాల్గొని ఘన నివాళులు అర్పించారు.

# గంజాయిని అక్రమంగా తరలిస్తున్న 8 మంది అరెస్టు



**నర్సీపట్నం, పతాకం న్యూస్ :** నర్సీపట్నం అడ్డాగా చేసుకుని శ్రీలంకకు గంజాయి అక్రమ రవాణా చేస్తున్న గాదె రేణుకను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. శారద నగర్లో అద్దె ఇంట్లో ఉంటూ గత ఏడాది కాలంగా రవాణా నిర్వహిస్తున్నట్లు గుర్తింపు గతంలో నాలుగు సార్లు పట్టు బడినట్లు సమాచారం.. ఈ కేసులో మరో ఏడు మందిని అదుపులోకి తీసుకున్నామని నర్సీపట్నం పరిధిలో గంజాయి అక్రమ రవాణా చేస్తూ గాదె రేణుక పోలీసు లకు చిక్కింది వాహన తనిఖీ ల్లో రేణుకతో పాటు మరో ఏడు మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. రూ.18.50 లక్షల విలువైన 74 కేజీల గంజాయి ఒక కారు రెండు స్కూటీలు స్వాధీనం చేసుకొని పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు ఈ పత్రిక సమావేశంలో రూరల్ సీఐ రేవతమ్మ, ఎస్ఐ తారకేశ్వరరావు పాల్గొన్నారు.

## గిరిజనులు ప్రగతి పథంలో పయనించాలి



**గుమ్మలక్ష్మీపురం, పతాకం న్యూస్:** గిరిజనులు ప్రగతి పథంలో పయనించాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ పిలుపునిచ్చారు. మండలంలోని గొరడ గ్రామంలో జట్టు స్వచ్ఛంద సేవాసంస్థ ఏర్పాటు చేసిన వావిలాల గోపాల కృష్ణయ్య స్మారక పురస్కార కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాలొన్నారు. ఈ సందర్భంగా వావిలాల గోపాలకృష్ణయ్య గ్రంథాలయాన్ని ఆయన ప్రారంభించారు. రూ.10 వేల విలువైన పుస్తకాలను అంద జేస్తున్నట్టు ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను పార్వతీపురంలో సామాన్య రైతు కుటుంబంలో జన్మించానని, కష్టపడి చదివి ఈ స్థాయికి ఎదిగానన్నారు. గిరిజన యువత ఉన్నత చదువులు చదవాలని, ఈ గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జట్టు సేవా సంస్థ ద్వారా చేపడుతున్న ప్రకృతి వ్యవసాయాన్ని గిరిజనులను చైతన్యపరిచే అంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గిరిజనులు ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండించడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా జట్టు సేవా సంస్థ వావిలాల గోపాలకృష్ణయ్య స్మారక పురస్కారాన్ని న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్‌కు ప్రదానం చేశారు. అనంతరం గిరి జన ప్రజలు, ప్రజా ప్రతిని?ధులు ఆయనకు పౌర సన్మానం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి మాట్లాడుతూ గిరిజన ప్రజలు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని, వీరికి వ్యవసాయంలో నూతన మెలకువలను తెలపాలన్నారు. గిరిజన ప్రాంతానికి హైకోర్టు జస్టిస్ రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయాధికారి ఎం.బబిత, ఎస్పీ మాధవరెడ్డి, అదనపు జిల్లా న్యాయాధికారి దామోదరరావు, జట్టు సేవా సంస్థ చైర్మన్ డి.పారినాయుడు, నాబార్డు డీడీఎం దినేష్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు కార్యక్రమానికి హాజరైన హైకోర్టు న్యాయమూర్తికి గిరిజనులు డప్పు వాయిద్యాలు, సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సంస్థ గిరిజనులకు రగ్గులను పంపిణీ చేశారు.

## జి.మాడుగుల ఎస్సైకి ఘన సన్మానం



**జీకేవీధి, పతాకం న్యూస్:** అల్లూరి జిల్లా జీకేవీధి మండలంలో జి మాడుగుల మండల కేంద్రంలో స్థానిక ఎస్సై (సబ్ ఇన్‌స్పెక్టర్) ని స్థానికులు మరియు ప్రముఖులు ఘనంగా సన్మానించారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన అందించాలని కోరారు. ఈ కార్యక్రమం ఎస్సైని పూలమాలలు దుస్సాలవతో ఘనంగా సత్కరించారు. ప్రజా స్పందన ఈ సందర్భంగా మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో ఎస్సై గా పనితీరు అభినందనీయమని, ముఖ్యంగా యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా అవగాహన కల్పించడంలో కీలక పాత్ర పోషించాలని ప్రశంసించారు. ఎస్సై కృతజ్ఞతలు ఈ సన్మానం తన బాధ్యతను మరింత పెంచిందని, ప్రజల సహకారంతో మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం కృషి చేస్తానని ఎస్సై ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీకేవీధి మండల పెదవలస సర్పంచ్ వంశీకృష్ణ, బీసీ వై పార్టీ జిల్లా ఇన్చార్జి కే రాజన్ గిరిజన సంఘం నాయకులు కే బాలయ్య, మర్రి కామయ్య ఆదిమజాతుల సేవ సంఘం నాయకుడు చిక్కుడు అశోక్ పాల్గొన్నారు.

## భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాల పండగ

**చోడవరం, పతాకం న్యూస్ : అనకాపల్లి జిల్లా చోడవరం గ్రామంలోఆర్టీసి కాంప్లెక్స్ వద్ద** జండా ఆవిష్కరణ కార్యక్రమం భారత కమ్యూనిస్టు పార్టీ అనకాపల్లి జిల్లా సహాయ కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో చేపట్టడం జరిగింది. కమ్యూనిస్టు పార్టీ భారతదేశంలో నేటికీ వంద సంవత్సరాలు పూర్తి చేసుకుని 101 సంవత్సరానికి అడుగుపెడుతున్న సందర్భంగా బడుగు బలహీన వర్గాలు కార్మికులు షెడ్యూల్ కులాలు షెడ్యూల్ ట్రైబల్ మరియు ఆదివాసులు మహిళలు పట్ల జరుగుతున్న దౌర్జన్యాన్ని ఎదుర్కొనే శక్తి ఒక సిపిఐ పార్టీ మాత్రమే ఉన్నది అని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తి లు కోముకాస్త బలవంతుపూ భూ సేకరణ కార్యక్రమం చేపడితూన్నారు ఆడుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి సోమదల దేవి, కాకి దేవి ఈమందకొండమ్మ. కామిరెడ్డి శేఖర్, పెదపాడు సూరిబాబు, కొట్టన సతీష్, కర్రి వీరమల్ల మధు మరియు కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న చలి తీవ్రత



**అరకు, పతాకం న్యూస్:** మన్యంలో క్రమంగా చలి పెరుగుతుండడంతో జనం వణుకుతున్నారు. వాతావరణంలో మార్పులతో పొగమంచు దట్టంగానే కురిసింది. దీంతో పాడేరు, అరకులో తెల్లవారుజాము నుంచి ఉదయం పది గంటల వరకు దట్టంగా పొగమంచు కురిసింది. తాజా వాతావరణం పర్యాటకులకు కనువిందు చేసేలా ఆహ్లాదకరంగా మారింది. దీంతో అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తున్నారు. మన్యంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. జి.మాడుగులలో 5.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా, అరకులోయలో 5.9, చింతపల్లిలో 7.3, ముంచంగిపుట్టులో 7.7, పాడేరులో 8.7, పెదబయలులో 9.5, హుకుంపేటలో 10.1, కొయ్యూరులో 11.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

## ప్రపంచ బ్లైండ్ మహిళా టీ20 క్రికెట్ వరల్డ్ కప్ విజేత పాంగి కరుణకుమారికి ఘన సన్మానం



**జీకేవీధి, పతాకం న్యూస్ :** అల్లూరి జిల్లా జీకేవీధి మండలం పాడేరు లో నేడు జరిగిన విజయో త్సవ ర్యాలీలో ఆదివాసులందరూ ఘన స్వాగతం పలుకుతూ మూడు కిలోమీటర్ల మేర విజయోత్సవ ర్యాలీ చేస్తూ స్వాగతం పలికారు ఆ తర్వాత మోదకొండమ్మ ఆడిటోరి యంలో సన్మాన సభ ఏర్పాటు చేస్తూ ఆదివాసి బిడ్డ అయిన పాంగి కరుణకుమారి ప్రపంచ వేదికలో రాణించిన కరుణకుమారి అందరూ ఆదర్శంగా తీసుకోవాలని కొనియాడారు. ఆదివాసులందరూ ఘనస్వాగతం లభించడం నిజంగా గర్వకారణంగా నేడు ఆమె సాధించిన అద్భుత విజయానికి గుర్తుగా ఏర్పాటు చేసిన ఊరేగింపు మరియు సన్మాన సభకు సంబంధించిన గిరిజన ప్రాంతం నుండి అంతర్జాతీయ స్థాయికి ఎదిగి, భారత జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన కరుణకుమారికి స్థానిక ప్రజలు, అధికారులు మరియు క్రీడా అభిమానులు నీరాజనాలు పడుతున్నారు. పాడేరు పురవీధుల్లో ఆమెను గౌరవిస్తూ నిర్వహిస్తున్న ఈ ఊరేగింపులో స్థానిక గిరిజన కళారూపాలు, డప్పు వాయిద్యాలతో కోలాహలం నెలకొంది. గిరిజన ముద్దుబిడ్డగా, ఎందరో యువతీ యువకులకు స్ఫూర్తిగా నిలిచిన కరుణకుమారిని ఈ వేదికపై ప్రముఖులు ఘనంగా సన్మానిస్తున్నారు. కరుణకుమారి సాధించిన విజయం చూపు లేకపోయినా, పట్టుదలతో క్రికెట్ రంగంలో రాణించి ప్రపంచ కప్ గెలవడం అనేది సామాన్యమైన విషయం కాదు. అల్లూరి జిల్లా ఏజెన్సీ ప్రాంతం నుండి వెళ్లి దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావడం ద్వారా ఆమె 'గిరిజన ఆణిముత్యం అనిపించుకున్నారు. ఇలాంటి ప్రతిభావంతులను ప్రోత్సహించడం ద్వారా భవిష్యత్తులో మరెందరో క్రీడాకారులు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంటుంది. గిరిజనులు ఫెరోపించారు ఈ కార్యక్రమంలో పెడవలస సర్పంచ్ పి వంశి కృష్ణ మరియు గిరిజన సంఘం నాయకులు కే బాలయ్య, బీసీ వై పార్టీ జిల్లా ఇన్చార్జి కే రాజన్ పిసా కమిటీ అధ్యక్షుడు పి కృష్ణ, మర్రి కామయ్య ఆదిమజాతుల సేవ సంఘం నాయకుడు చిక్కుడు అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ హితంగా జీవించడానికి పర్యావరణ దినోత్సవాల క్యాలెండర్

**విజయనగరం, పతాకం న్యూస్ :** పర్యావరణ హితంగా జీవించడానికి పర్యావరణ దినోత్సవాల క్యాలెండర్ ఉపకరిస్తుంది అని విజయనగరం మున్సిపల్ కమిషనర్ పల్లి నల్లనయ్య పేర్కొన్నారు . ఈ మేరకు ఆయన శుక్రవారం ఉదయం విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం లో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జిఓ ముద్రించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవాల క్యాలెండర్ ను ఆవిష్కరించారు . అనంతరం ఆయన మాట్లాడుతూ గడిచిన 25 సంవత్సరాలుగా పర్యావరణ దినోత్సవాలు క్యాలెండర్ ముద్రించడం ఆనందదాయకం అన్నారు. ప్రతి విద్యా సంస్థలో ఈ క్యాలెండర్ వినియోగించి పర్యావరణ దినోత్సవాలు నిర్వహించాలని కోరారు. గ్రీన్ క్లైమేట్ టీం ఎన్విరాన్మెంటల్ ఎడ్యుకేషన్ రిసోర్స్ సెంటర్ ద్వారా అన్ని విద్యాసంస్థలకు అవసరమైన పర్యావరణ సమాచారం కూడా అంద జేస్తుందని దీనిని విద్యాసంస్థలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐక్యరాజ్యసమితి, భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన అన్ని పర్యావరణ దినోత్సవాలు ఈ క్యాలెండర్ లో ఉండటం వల్ల విద్యా సంస్థలకు బాగా ఉపకరిస్తుంది అని వివరించారు.

## సంక్రాంతికి మరిన్ని ప్రత్యేక రైళ్లు..



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ప్రత్యేకరైలు (07452) నాందేడ్ నుంచి జనవరి 12న మధ్యాహ్నం 1.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9 గంటలకు కాకినాడకు చేరుకుంటుంది. కాకినాడ (07453) నుంచి జనవరి 13న మధ్యాహ్నం 1 గంటకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7 గంటలకు నాందేడ్‌కు చేరుకుంటుంది. అలాగే, మచిలీపట్నం నుంచి ప్రత్యేకరైలు (07454) జనవరి 11, 18వ తేదీల్లో ఉదయం 10 గంటలకు బయల్దేరి.. మరుసటి రోజు రాత్రి ఎనిమిది గంటలకు వికారాబాద్ చేరుకుంటుంది. ప్రత్యేక రైలు(07455) వికారాబాద్ నుంచి జనవరి 11, 18 తేదీల్లో రాత్రి పది గంటలకు బయల్దేరి.. మరుసటి రోజు ఉదయం 8.15కి మచిలీపట్నం చేరుకుంటుంది. అలాగే... కాకినాడ నుంచి సికింద్రాబాద్ మీదుగా వికారాబాద్, నాందేడ్ మార్గాల్లో, వికారాబాద్ నుంచి సికింద్రాబాద్ మీదుగా మచిలీపట్నం మార్గంలో మొత్తం ఆరు రైళ్లను నడపాలని నిర్ణయించారు. ప్రత్యేకరైలు (07450) కాకినాడ నుంచి జనవరి 19న సాయంత్రం 4.45 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7 గంటలకు వికారాబాద్‌కు చేరుకుంటుంది. అలాగే, ప్రత్యేకరైలు(07451) వికారాబాద్ నుంచి జనవరి 20న ఉదయం 9 గంటలకు బయలుదేరి రాత్రి 9.15 గంటలకు కాకినాడకు చేరుకుంటుంది.

## ఆర్టీసీ ఉద్యోగులకు శుభవార్త.. ఏపీ సర్కార్ కీలక ఉత్తర్వులు జారీ




**అమరావతి, పతాకం న్యూస్:** మెడికల్ అన్ ఫిట్ అయిన ఆర్టీసీ ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. మెడికల్ అన్ ఫిట్ అయిన ఉద్యోగులకు ప్రత్యామ్నాయ ఉద్యోగాలివ్వాలని నిర్ణయిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వంలో విలీనం అనంతరం మెడికల్ అన్ ఫిట్ అయిన ఉద్యోగులకు ప్రత్యామ్నాయ ఉద్యోగాలివ్వాలని సర్కార్ నిర్ణయించింది. 2020 జనవరి 1 తర్వాత మెడికల్ అన్ ఫిట్ అయిన ఉద్యోగులకు ప్రత్యామ్నాయ ఉద్యోగాలు ఇవ్వనున్నారు. విలీనానికి ముందు మెడికల్ అన్ ఫిట్ అయిన డ్రైవర్లకు మాత్రమే ప్రత్యామ్నాయ ఉద్యోగాలిచ్చే విధానం ఉండదే. ఇకపై ఆర్టీసీలో డ్రైవర్లు, కండక్టర్లు, సహా మిగిలిన ఉద్యోగులందరికీ ప్రత్నామ్నాయ ఉద్యోగాలివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. కార్పొరేషన్‌లో ఉండగా 21 కేటగిరీలో మెడికల్ అన్ ఫిట్ అయిన వారికి ప్రత్నామ్నాయ ఉద్యోగాలు ఇవ్వనున్నారు. విలీనం తర్వాత కూడా 21 కేటగిరీల్లో మెడికల్ అన్ ఫిట్ అయిన వారికి ప్రత్యామ్నాయ ఉద్యోగాలు ఇవ్వాలివ్వాలని సర్కార్ నిర్ణయించింది. మెడికల్ అన్ ఫిట్ అయిన వారికి కండక్టర్, రికార్డు ట్రేసర్, అసిస్టెంట్ మెకానిక్ /శ్రామిక్ ఉద్యోగాలివ్వాలని నిర్ణయం తీసుకుంది. ఆర్టీసీలో ఇచ్చే ఉద్యోగానికి అర్హత లేకపోతే ప్రభుత్వ విభాగాల్లో అర్హత బట్టి ఉద్యోగాలివ్వాలని ఆదేశాలు జారీ అయ్యాయి. కలెక్టర్ల ద్వారా ప్రభుత్వ విభాగాల్లో అర్హత మేరకు ఉద్యోగాలివ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. ఏ ఉద్యోగానికీ అర్హత లేని వారికి అదనపు మానిటరీ ప్రయోజనాలు ఇవ్వాలని స్పష్టం చేసింది. మెడికల్ అన్ ఫిట్ వల్ల వాలంటరీ రిటైర్డ్ అవ్వాలనుకునే వారికి అదనపు మానిటరీ ప్రయోజనాలు చేకూరేలా తదుపరి చర్యలు తీసుకోవాలని ఎపీపీటీడీ కమిషనర్‌కు ప్రభుత్వం కీలక ఆదేశాలు ఇచ్చింది. అలాగే తదుపరి చర్యలు తీసుకోవాలని అన్ని జిల్లా కలెక్టర్లకు సర్కార్ ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి .కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు ఆర్టీసీలో ఉద్యోగులందరికీ ప్రయోజనాలివ్వడంపై ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. మెడికల్ అన్ ఫిట్ అయిన ఉద్యోగులందరికీ ప్రత్నామ్నాయ ఉద్యోగాలివ్వడంపై ఆనందం తెలుపుతున్నారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు ఆర్టీసీ ఎన్ఎంయూఎ నేతలతో పాటు ఆర్టీసీ ఈయూ, కార్మిక పరిషత్ నేతలు ధన్యవాదాలు తెలియజేశారు.

## అగరుబత్తీలపై కేంద్రం కొత్త ప్రమాణాలు... వినియోగదారుల భద్రతే లక్ష్యం

**గుంటూరు, పతాకం న్యూస్ :** దేశంలో అగరుబత్తీల (ధూప్ స్టిక్స్) నాణ్యత, భద్రతను పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వినియోగదారుల ఆరోగ్యం, పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకుని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) కొత్త ప్రమాణాలను విడుదల చేసింది. 'జాతీయ వినియోగదారుల దినోత్సవం 2025' సందర్భంగా శుక్రవారం కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి "ఐఎస్ 19412:2025 – అగరుబత్తీల స్పెసిఫికేషన్" పేరుతో ఈ నూతన ప్రమాణాలను ఆవిష్కరించారు. ఈ కొత్త నిబంధనల ప్రకారం, అగరుబత్తీల తయారీలో పలు హానికరమైన పురుగుమందులు, సింథటిక్ సువాసనల వాడకాన్ని పూర్తిగా నిషేధించారు. అలత్రిన్, పెర్మెత్రిన్, సైపర్‌మెత్రిన్, డెల్టామెత్రిన్, ఫిప్రోనిల్ వంటి పురుగుమందులతో పాటు బెంజైల్ సైనైడ్, ఇథైల్ అక్రిలేట్ వంటి రసాయనాల వాడకంపై ఆంక్షలు విధించారు. వీటిలో చాలా రసాయనాలు మానవ ఆరోగ్యం, గాలి నాణ్యతపై తీవ్ర ప్రభావం చూపుతాయని అంతర్జాతీయంగా నిషేధంలో ఉన్నాయి. ప్రపంచంలోనే అగరుబత్తీల ఉత్పత్తి, ఎగుమతుల్లో భారత్ అగ్రస్థానంలో ఉంది. దేశంలో ఏటా రూ. 8,000 కోట్ల పరిశ్రమ ఉండగా, సుమారు 150 దేశాలకు రూ. 1,200 కోట్ల విలువైన ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది. ఈ రంగం గ్రామీణ ప్రాంతాల్లోని ఎందరో చేతివృత్తుల వారికి, మహిళలకు ఉపాధి కల్పిస్తోంది.కొత్త ప్రమాణాల ప్రకారం అగరుబత్తీలను యంత్ర నిర్మిత, చేతితో తయారు చేసినవి, సాంప్రదాయ మసాలా రకాలుగా వర్గీకరించారు. ముడిసరుకులు, మండే విధానం, సువాసన వంటి అంశాల్లో నాణ్యతను నిర్దేశించారు. ఈ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ఉత్పత్తులకు 'బీఐఎస్ స్టాండర్డ్ మార్క్' లభిస్తుంది. దీనివల్ల వినియోగదారులు నాణ్యమైన, సురక్షితమైన ఉత్పత్తులను సులభంగా గుర్తించవచ్చని ప్రభుత్వం తెలిపింది.

# నత్తనడకన 'హైదరాబాద్-విజయవాడ' రహదారి పనులు



**విజయవాడ, పతాకం న్యూస్:** హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై పంతంగి టోల్‌ప్లాజా మీదుగా గత ఏడాది భోగి పండగ ముందు రోజున 84,262 వాహనాలు రాకపోకలు సాగించాయి. అయితే సాధారణ రోజుల్లో ఈ టోల్‌ప్లాజా మీదుగా 40 వేలలోపే వెళ్తుంటాయి. కానీ సంక్రాంతి వచ్చిందంటే మాత్రం సొంతూళ్లకు వెళ్లే ఏపీ వాసులతో ఈ రహదారి వాహనాలతో బారులు తీరుతుంది. ముఖ్యంగా టోల్‌ప్లాజాలు, పట్టణాలు, కూడళ్లలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. గతేడాది సంక్రాంతికి ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో దారి పొడవునా ట్రాఫిక్‌జామ్‌తో వాహనదారులు ఇబ్బందిపడ్డారు. మరికొన్ని రోజుల్లో మళ్లీ పండగ రద్దీ మొదలుకానుంది. ఈసారి కూడా ముందస్తు ప్రణాళికలేమీ కనిపించక పోవడంతో మళ్లీ ట్రాఫిక్ సమస్యలు తప్పేలా లేవు. హైదరాబాద్–విజయవాడ హైవేపై తరచూ ప్రమాదాలు జరిగే 17 బ్లాక్‌స్పాట్లలో రెండేళ్ల క్రితం వివిధ పనులు ప్రారంభించారు. ఏడాదిన్నర సమయంలో పూర్తి చేయాలని గుత్తేదారు సంస్థను ఆదేశించినప్పటికీ పనులు ముందుకు సాగడం లేదు. దాదాపు 17 బ్లాక్‌స్పాట్లలో 16 ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలోనే ఉండగా మిగతా ఒకటి ఆంధ్రప్రదేశ్?లోని నవాబుపేట వద్ద ఉంది. దీనికోసం సుమారు రూ.300 కోట్ల వ్యయంతో చౌటుప్పల్‌లో ఒక ఫ్లైఓవర్, 13 అండర్‌పాస్ వంతెనలు, 10 చోట్ల సర్వీసు రోడ్ల నిర్మాణాలను భారీ ఎత్తున చేపడుతున్నారు. అయినా సరే ఇప్పటికీ సగం చోట్ల పనుల్లో వేగం పుంజుకోలేకపోవడం గమనార్హం. అండర్‌పాస్ వంతెన పనులను ఇంకా ప్రారంభించనేలేదు. దీని ప్రభావంతో చౌటుప్పల్ ఆర్టీసీ బస్టాండు, నారాయణపురం రోడ్డు, వలిగొండ రోడ్డు కూడళ్లలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం నెలకొంటోంది. చిట్యాల మండలం పెద్దకాపర్తిలోనూ అండర్‌పాస్ వంతెన పనులు అర్ధంతరంగా ఆపేశారు. చిట్యాలలో కేవలం ఒక వైపే 30% మట్టిని పోసి గుత్తేదారు నిర్లక్ష్యంగా వదిలేశారు. అనుకోకుండా ట్రాఫిక్‌జామ్ ఏర్పడినప్పుడు పోలీసులు వాహనాల రాకపోకలను మునుగోడు మీదుగా మళ్లిస్తున్నారు. ఇక్కడ ముందస్తు చర్యలు చేపట్టకపోతే సంక్రాంతికి భారీగా ట్రాఫిక్‌జామ్ ఏర్పడుతుంది. కట్టంగూరు జంక్షన్, ఇనుపాముల, టేకుమట్ల, సూర్యాపేట ఎస్వీ కళాశాల–జనగామ కూడలి, జమ్మిగడ్డ కూడలి, దురాజ్‌పల్లి, ముకుందాపురం యూటర్న్, మునగాల, కోమరబండ, కోదాడ, మేళ్లచెర్వు పైవంతెన, శ్రీరంగాపురం అండర్‌పాస్ వంతెన, సర్వీసు రోడ్డు పనులు నత్తనడకన నడుస్తున్నాయి. ఈసారి భారీ వర్షాలు పనులకు ఆటంకం కలిగించాయని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు చెబుతున్నారు. నార్కట్‌పల్లి తర్వాత కొన్ని వాహనాలు మిర్యాలగూడ మీదుగా అద్దంకి, చెన్నై వైపు వెళ్తాయి. కొర్లపహాడ్ టోల్‌గేట్ దాటాక మరికొన్ని ఉమ్మడి ఖమ్మం జిల్లా వైపు, ఇంకొన్ని విజయవాడ వైపుగా వెళ్తాయి. ఈ విధంగా మూడు వైపులా వెళ్లేవి నార్కట్‌పల్లి వరకు రావాల్సిందే. అందువల్లే చౌటుప్పల్, పెద్దకాపర్తి, చిట్యాల బ్లాక్‌స్పాట్ల వద్ద వాహనాల రద్దీ అధిక స్థాయిలో నెలకొంటుంది. సంక్రాంతి రద్దీని దృష్టిలో పెట్టుకొని చౌటుప్పల్, పెద్దకాపర్తి, చిట్యాలలో వాహనాల రాకపోకలపై ఎన్‌హెచ్‌ఏఐ, పోలీసు అధికారులు దృష్టి సారించాలి.

తీవ్ర వాహనాల రద్దీతో రోడ్లపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ట్రాఫిక్ పోలీసులు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ సమస్యలు మాత్రం నివారించలేకపోతున్నారు. దీంతో హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారి (65వ నంబర్)లో వాహనాల రద్దీ పెరిగింది. దాంతో విజయవాడ వైపు వాహనాలు బారులు తీరుతున్నాయి. రాబోయే రోజుల్లో రానున్న సంక్రాంతి సెలవుల నేపథ్యంలో పట్టణ వాసులంతా ఒక్కసారిగా పల్లెబాట పట్టనున్నారు. దాంతో హైదరాబాద్ నగరంలోని ప్రధాన రహదారులన్నీ వాహనాలతో మరింత కిక్కిరిసిపోయే సమస్య ఉండనుంది. బ్లాక్‌స్పాట్ల వద్ద ప్రయాణికులకు ఆటంకం కలగకుండా, రాకపోకలు సాఫీగా జరిగేలా ముందస్తు చర్యలు తీసుకుంటామని ఎన్‌హెచ్ 65 ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. సర్వీసు రోడ్లు పూర్తిచేయాలని గుత్తేదారుకు సూచిస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. చౌటుప్పల్ మినహా మిగతా అండర్‌పాస్ వంతెనలను మార్చిలోపు పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. జూన్‌లోగా చౌటుప్పల్‌లో ఫ్లైఓవర్, అండర్‌పాస్‌ను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

# గిరి బాలల చదువుపై శ్రద్ధ.. విద్యాభివృద్ధికి చర్యలు



**పాడేరు, పతాకం న్యూస్ :** జిల్లాలో విద్యాభివృద్ధికి అధికారులు చేపడుతున్న ప్రత్యేక చర్యలతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు లభించడంతో పాటు 90 వేల మంది గిరిజన విద్యార్థులకు, 6 వేల మంది టీచర్లకు ప్రయోజనం చేకూరుతున్నది. ఈ ప్రత్యేక చర్యలపై వివరాలు తెలుసుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇటీవల కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్‌ను అభినందించిన సంగతి తెలిసిందే. శత శాతం ఫలితాల సాధనకు అమలు చేస్తున్న వంద రోజుల ప్రణాళిక సత్ఫలితాలను ఇస్తుందని అధికారులు భావిస్తున్నారు.

జిల్లా శత శాతం గిరిజన ప్రాంతం కావడంతో పాటు పలు ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో విద్యా రంగంలో ఆశించిన ఫలితాలు లభించడం లేదు. ప్రధానంగా విద్యకు పునాదిగా భావించే ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయిల్లో గిరిజన విద్యార్థులకు ఆశించిన విద్యాబోధన అందకపోవడమే కారణమని గుర్తించారు. అందువల్లే గిరిజన విద్యార్థులు ఉన్నత తరగతుల్లో ఇబ్బందులు పడుతున్నారని అధికారులు అంటున్నారు. ఈ క్రమంలో ప్రాథ?మిక, ప్రాథమికోన్నత స్థాయిల్లో విద్యార్థులకు ముఖ్యమైన తెలుగు, ఇంగ్లీషు, లెక్కలు సబ్జెక్టుల్లో ప్రత్యేక బోధనా తరగతులు అవసరమని అధికారులు భావించారు. ఈ నేపథ్యంలో 3 నుంచి 9 తరగతులు చదువుతున్న విద్యార్థులకు బోధించే ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ అందించడంతో పాటు, సమగ్ర శిక్ష రూపొందించిన 21 రకాల మాడ్యుల్‌ను వినియోగించి బోధన సాగించేలా గత నవంబరు 20 నుంచి వంద రోజుల ప్రణాళికను పాఠశాలల్లో అమలు చేస్తున్నారు. జిల్లాలో గిరిజన విద్యాభివృద్ధిని మరింత పటిష్ఠం చేసేందుకు టీచింగ్ ఎట్ రైట్ లెవల్(టీఆర్ఎల్)ను అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది అక్టోబరు నెలలో 3 నుంచి 9 తరగతులు బోధిస్తున్న టీచర్లకు తెలుగు, ఇంగ్లీషు, లెక్కలు సబ్జెక్టులపై 21 మాడ్యుల్‌తో 6 వేల 216 మంది టీచర్లకు ప్రత్యేక శిక్షణ అందించారు. ఇందుకు గాను 40 మంది రాష్ట్ర స్థాయి రీసోర్సు పర్సన్లు, 88 మంది జిల్లా స్థాయి రీసోర్సు పర్సన్లు పని చేశారు. శిక్షణ పొందిన టీచర్ల ద్వారా ప్రత్యక్షంగా 90 వేల మంది గిరిజన విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. కాగా అన్ని తరగతుల్లోనూ చక్కని ఫలితాలను రాబెట్టేందుకు ఈ ఏడాది నవంబరు 20 నుంచి వంద రోజుల ప్రణాళిక పేరిట ప్రత్యేక బోధన సా?గిస్తున్నారు. ఇందులో భాగంగా టీచర్లతో ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులకు ప్రత్యేక స్టడీ అవర్లను నిర్వహిస్తున్నారు. జిల్లాలోని పరిస్థితులకు అనుగుణంగా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్, సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ స్వామినాయుడు ప్రత్యేక చొరవతో టీచింగ్ ఎట్ రైట్ లెవల్(టీఆర్ఎల్)ను, వంద రోజుల విద్యా ప్రణాళికను అమలు చేస్తుండడంపై సీఎం చంద్రబాబునాయుడు ఇటీవల అమరావతిలో జరిగిన కలెక్టర్ల సదస్సులో కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

## న్యాయవాదులపై పోలీసుల దాడికి నిరసన

**గుంటూరు, పతాకం న్యూస్ :** కర్నూలు జిల్లా పత్తికొండ కోర్టు ఆవరణలో న్యాయవాదులపై పోలీసులు జరిపిన దాడి ని నిరసిస్తూ చిలకలూరిపేట న్యాయవాదులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల తీరును ఖండిస్తూ శుక్రవారం స్థానిక కోర్టు ముందు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. బార్ అసోసియేషన్ పిలుపుమేరకు చిలకలూరిపేటలోని న్యాయవాదులందరూ కోర్టు విధులను బహిష్కరించారు. న్యాయం కాపాడాల్సిన పోలీసులే, న్యాయస్థానాల పరిధిలో ఉన్న న్యాయవాదుల పై భౌతికదాడులకు దిగడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టన్నారు. ఈ సందర్భంగా న్యాయవాదులు తమ డిమాండ్లను లేవనెత్తారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. పత్తికొండలో న్యాయవాదులపై దాడికి పాల్పడిన పోలీసు అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని, న్యాయవాదులకు వృత్తిపరమైన రక్షణ కల్పించేందుకు ప్రత్యేక 'అడ్వకేట్ ప్రొటెక్ష న్ యాక్ట్'ను వెంటనే అమలు చేయాలన్నా రు. ఈ కార్యక్రమంలో చిలకలూరిపేట బార్ అసోసియేషన్ ప్రతినిధులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొని సంఘీభావం తెలిపారు.



# సంతాన లేమి సమస్యలకు కారణాలేంటి?

ప్రస్తుతం చాలా మంది ఉన్నత చదువులు చదువుతున్నారు. ఉద్యోగాలు చేస్తూ, ఉన్నత పదవులు అందుకుంటున్నారు. ఇలా చదువులు, కెరీర్ ధ్యాసలో పడటం వల్ల పెళ్లి ఆలస్యంగా చేసుకుంటున్నారు. ఒకవేళ చేసుకున్న తర్వాత సంతానం కనటాన్ని వాయిదా వేసుకుంటున్నారు. జీవితంలో స్థిరపడ్డ తర్వాతే పిల్లలను కనాలని భావిస్తున్నారు. తర్వాత సంతానం కలగక డాక్టర్లు, ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. మరి, ఈ పరిస్థితికి కారణలేంటో ఇప్పుడు తెలుసుకుందాం! ఇప్పుడు ఉమ్మడి కుటుంబాలు కనుమరుగు కావటం, భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తుండటం, పిల్లలను కన్న తర్వాత వారి ఆలనా పాలనా చూసుకునేవారు ఇంట్లో లేకపోవటం వంటివీ ఇలాంటి నిర్ణయం తీసుకోవటానికి పురికొల్పుతున్నాయంటున్నారు నిపుణులు. కెరీర్ పరంగా ఇది మంచిదే కావొచ్చు కానీ, ఆలస్యమవుతున్నకొద్దీ గర్భం ధరించటం కష్టమవుతుందని వివరిస్తున్నారు. రెండు మూడేళ్లు ప్రయత్నిస్తున్నా గర్భం ధరించకపోతే దంపతులు కుటుంబ సభ్యుల నుంచి ఒత్తిడినీ ఎదుర్కోవాల్సి వస్తుంటుందని హెచ్చరిస్తున్నారు. ఇది ఆందోళనకు దారితీయటమే కాదు, సంతానం కలగటంలోనూ ఇబ్బందులకు దారితీస్తుందని పేర్కొంటున్నారు. మహిళల్లో సంతానం కలిగే దశ పరిమితం అని అంటున్నారు నిపుణులు. రజస్వల నుంచే ఇది మొదలైనప్పటికీ తొలినాళ్లలో అండం సరిగా విడుదల కాదని, నెలసరీ సక్రమంగా అవదని చెబుతున్నారు. అంటే, రెండు మూడేళ్ల తర్వాతే సంతానం కలిగే అవకాశముంటుందని వివరిస్తున్నారు. అంతేకాకుండా, మహిళల్లో సంతానం కలిగే అవకాశం 32 ఏళ్ల నుంచీ తగ్గుతూ వస్తుంటుందని, ఇది 37 ఏళ్ల తర్వాత గణనీయంగా పడిపోతుందని పేర్కొంటున్నారు. 40 ఏళ్ల వయసులోపు అండాశయాలు పనిచేయడం మానేస్తాయని అధ్యయనం పేర్కొంది. అదే, మగవారికి ఏ వయసులోనైనా




సంతానాన్ని కనే సామర్థ్యముంటుందని భావిస్తుంటారని, ఇది నిజం కాదని అంటున్నారు. మగవారికీ వయసు మీద పడుతున్న కొద్దీ సంతానం కలిగే సామర్థ్యం తగ్గుతూ వస్తుందని, వీర్యం నాణ్యత, శుక్రకణాల సంఖ్య 35 ఏళ్ల తర్వాత తగ్గుముఖం పడుతుందని తెలియజేస్తున్నారు. సంతానలేమితో బాధపడే మహిళల్లో రజస్వల నాటి నుంచే కొన్ని హెచ్చరిక సంకేతాలు కనిపిస్తాయంటున్నారు నిపుణులు. ఈ నేపథ్యంలో నెలసరి సక్రమంగా రాకపోవచ్చని, చాలా త్వరగా కానీ, మరీ ఆలస్యంగా కానీ అవచ్చని చెబుతున్నారు. కొంత మందికి నెల కన్నా ఎక్కువ సమయం పట్టొచ్చని, మరికొందరికి కొన్ని నెలల తర్వాతా నెలసరి రావొచ్చని పేర్కొంటున్నారు. ఒకసారి రుతుక్రమం మొదలైతే ఎక్కువ కాలం కొనసాగొచ్చని తెలియజేస్తున్నారు. ఇన్సులిన్ నిరోధకత, ఊబకాయం, ముఖం లేదా శరీరంపై అసాధారణ జుట్టు పెరుగుదల, మొటిమలతో సంబంధం కలిగి ఉంటుందని అధ్యయనం పేర్కొంది. ఇలాంటి సమస్యలకు ప్రధానంగా హార్మోన్ల సమతుల్యత లోపించటం దోహదం చేస్తుందంటున్నారు.

అండాశయాల్లో నీటితిత్తులు అండం సరిగా విడుదల కాకపోవటం, చిన్నవయసులోనే అండాశయాలు పనిచేయటం మానెయ్యొచ్చని తెలియజేస్తున్నారు. ఇలాంటి సమస్యలకు చాలావరకూ రక్త పరీక్షలు, స్కానింగ్?తో గుర్తించవచ్చని సూచిస్తున్నారు. హార్మోన్ల మోతాదులు మామూలుగా ఉన్నా కూడా కొన్ని అవయవ సమస్యలూ సంతానం కలగటంలో ఇబ్బందులు రావొచ్చని నిపుణులు చెబుతున్నారు. ఇందులో గర్భాశయం లోపలి పొరలు అయినా ఎండోమెట్రియం గర్భసంచి వెలుపలా పెరుగుతుందని, ఇది అండాశయాలను దెబ్బతీయొచ్చు, ఫెలోపియన్ గొట్టాలు మూసుకునేలా చేయొచ్చని వివరిస్తున్నారు. కొందరిలో కడుపులో వచ్చే క్షయ, కటిభాగంలో వచ్చే ఇతరత్రా సమస్యలూ గర్భధారణకు ఇబ్బంది కలిగించొచ్చని, మరికొందరిలో పుట్టుకతోనే గర్భాశయంలో లోపాలు ఉండొచ్చని పేర్కొంటున్నారు. స్త్రీ పునరుత్పత్తి వ్యవస్థలో అండాశయాలు, గర్భాశయం, ఫెలోపియన్ నాళాలు, ఎండోక్రైన్ వ్యవస్థ వంటి అనేక రకాల అసాధారణతల వల్ల వంధ్యత్వం సంభవించవచ్చని అధ్యయనం పేర్కొంది. మగవారిలో క్రోమోజోమ్‌ల లోపాలు, వృషణాలు కిందికి దిగకపోవటం, వృషణాల ఇన్‌ఫెక్షన్ వంటి సమస్యలు సంతానం కలగకపోవటానికి దారితీయొచ్చని నిపుణులు చెబుతున్నారు. వరిబీజం కూడా ఒక కారణం అంటున్నారు. అంతేకాకుండా, మద్యం తాగటం, సిగరెట్లు కాల్చటం, మాదక ద్రవ్యాల వ్యసనం వంటివీ వీర్యం నాణ్యత, పనితీరును దెబ్బతీయొచ్చని హెచ్చరిస్తున్నారు. మహిళలు, పురుషులోనూ డయాబెటిస్, ఇతర దీర్ఘకాల సమస్యలూ సంతానలేమికి కారణమవుతుంటాయని నిపుణులు అంటున్నారు. అలాగే, ఒబెసిటీ కూడా పెద్ద ముప్పు కారకంగా చెబుతున్నారు. పురుగుమందులు, ప్లాస్టిక్స్,? వాహనాల నుంచి వెలువడే పొగ వంటి పర్యావరణ అంశాలూ సంతానం కలగకపోవటానికి దారితీస్తుంటాయని వివరిస్తున్నారు. గర్భధారణకు ప్రయత్నిస్తున్నా సంతానం కలగకపోవటం మనసును కలచివేస్తుందని, కుంగుబాటుకు దారితీస్తుందని నిపుణులు చెబుతున్నారు. అందువల్ల శాస్త్రీయ పద్ధతిలో చికిత్స తీసుకోవాలని సూచిస్తున్నారు. ఐవీఎఫ్ వంటి పద్ధతులు ఎంతో మేలు చేస్తాయని, ఆయా వ్యక్తులకు అనుగుణంగా చికిత్స చేయాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు. భార్యాభర్తలు ఒకరినొకరు నిందించుకోకుండా కలిసికట్టుగా ప్రయత్నిస్తే సంతానభాగ్యాన్ని పొందటం పెద్ద కష్టమేమీ కాదంటున్నారు. సంతానం కోసం నిజంగా, తరచూ ప్రయత్నిస్తున్నప్పటికీ ఏడాది దాటినా గర్భం ధరించకపోతే సంతానలేమి సమస్యగా పరిగణిస్తారని అంటున్నారు నిపుణులు. దీనికి కారణం సుమారు 15 శాతం మహిళల్లో ఉంటే, దాదాపు 15 శాతం మగవారిలో ఉంటుందని పలు అధ్యయనాల్లో వెల్లడైంది. ఇద్దరినీ కలిపితే 15 శాతం వరకూ కారణం కనిపిస్తుందని తెలియజేస్తున్నారు. కొన్ని సార్లు ఎలాంటి కారణం లేకపోయినా సంతానం కలగకపోవచ్చని సూచిస్తున్నారు.

# రోజువారి అలవాట్లతో జుట్టు ఆరోగ్యంగా ..

రోజును ఆరోగ్యంగా ప్రారంభిస్తే, రోజంతా ఉత్సాహంగా ఉండవచ్చన్న సంగతి అందరికీ తెలిసిందే! ఈ నియమం కురుల ఆరోగ్యానికి వర్తిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో మనం పాటించే కొన్ని అలవాట్లు జుట్టు ఒత్తుగా, దృఢంగా పెరిగేలా చేస్తాయని అంటున్నారు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం! చాలా మందికి నిద్ర లేవగానే కాఫీ, టీ తాగే అలవాటు ఉంటుంది. కానీ, వీటికి ముందు గ్లాసు నీళ్లు తాగాలని నిపుణులు చెబుతున్నారు. దీంతో కుదుళ్లలో చర్మం తేమగా మారి జుట్టు ఎదుగుదలను ప్రేరేపిస్తుందంటున్నారు. ఒకవేళ ప్లెయిన్ వాటర్ తాగలేని వారు అందులో నిమ్మరసం, కీరాదోస ముక్కలు వంటివి కలుపుకొని తీసుకోవచ్చని పేర్కొన్నారు.

మార్నింగ్ మనం తీసుకొనే అల్పాహారం ఆకలి తీర్చడానికే కాదు, జుట్టు ఒత్తుగా పెరిగేలా కూడా చేస్తుందంటున్నారు నిపుణులు. అయితే, ఇందుకోసం ప్రొటీన్లు అధికంగా ఉండే పెరుగు, నట్స్, పీనట్ బటర్, కోడిగుడ్లు, ప్రొటీన్ బార్స్ వంటివి తీసుకోవాలని చెబుతున్నారు. అలాగే, ఒత్తిడి ఆరోగ్యాన్నే కాదు, జుట్టు ఆరోగ్యాన్నీ దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. ఈ సమస్య నుంచి విముక్తి పొందడానికి ఉదయాన్నే చేసే వ్యాయామాలు ఎంతో కీలకమైనవని చెబుతున్నారు. ఇందులో భాగంగా నడక, యోగా, ధ్యానం వంటివి ప్రయత్నించాలని, ఇవి కుదుళ్లకు రక్తప్రసరణను మెరుగుపరిచి జుట్టు ఒత్తుగా పెరిగేలా చేస్తాయంటున్నారు. మార్నింగ్ ఆఫీస్‌కి రెడీ అయ్యే క్రమంలో చక్కగా దువ్వి జడ వేసుకుంటాం. అయితే, అంతకంటే ముందు కాస్త కొబ్బరి, బాదం లేదా జొజోబా నూనెల్లో ఏదో ఒక దాన్ని కుదుళ్లకు అప్లై చేసుకొని 5 నుంచి 10 నిమిషాల పాటు మర్దన చేసుకోవాలని, దీని వల్ల జుట్టుకు పోషణ అంది ఒత్తుగా పెరుగుతుందని చెబుతున్నారు. కొంత మంది అయితే జుట్టంతా బిగుతుగా లాగి బ్యాండ్ పెడతారు. అయితే ఇలా చేయడం వల్ల కుదుళ్లు బలహీనంగా తయారవుతాయని తెలిపారు. అందుకే జుట్టుకు సిల్క్ లేదా శాటిన్ రబ్బర్ బ్యాండ్లు వాడడం, వదులుగా జడ వేసుకోవడం లేదా ముడేసుకోవడం మేలంటున్నారు. అంతేకాకుండా బిగుతైన పోనీటెయిల్స్, కార్న్‌రోస్, బన్స్,హెయిర్ ఎక్స్‌టెన్షన్స్ అనేవి అలోపేసియాకు కారణమవుతాయని పేర్కొంది. అలాగే జుట్టు దువ్వుకోవడానికి చెక్కతో చేసిన, మందపాటి బ్రిజిల్స్ ఉన్న దువ్వెన ఉపయోగించడం మేలని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల జుట్టు రాలే సమస్య తగ్గుతుందని తెలిపారు. అలాగే తలస్నానానికి గోరువెచ్చటి నీళ్లు ఉపయోగించడం, సల్ఫేట్లు లేని షాంపూలు వాడడం మంచిదంటున్నారు. ఇక జుట్టు ఆరబెట్టుకోవడానికి బ్లో డ్రయర్స్, జుట్టు కర్లీగా లేదా స్ట్రెయిట్‌గా ఉండేందుకు హెయిర్ స్టైలింగ్ టూల్స్ వాడేవారు తక్కువ ఉష్ణోగ్రతను సెట్ చేసుకోవాలని సూచిస్తున్నారు. అంతేకాకుండా, వీటిని వాడే ముందు హెయిర్ స్ప్రే లేదా సీరమ్ వంటివి ఉపయోగించాలని సలహా ఇస్తున్నారు. ఉదయాన్నే మనకు నచ్చిన పనులకు కాసేపు సమయం కేటాయిస్తే, ఆ రోజంతా ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపేయచ్చని నిపుణులు చెబుతున్నారు. అయితే ఈ అలవాటు జుట్టు ఎదుగుదలనూ ప్రేరేపిస్తుందని పేర్కొన్నారు. ఎలాగంటే, నచ్చిన పనులు చేయడం వల్ల ఒత్తిడి దరిచేరదని, ఇది జుట్టు ఆరోగ్యానికీ మేలని తెలిపారు.



బయటికి వెళ్లేటప్పుడు : ఎండ వల్ల చర్మం కందిపోకుండా సన్‌స్క్రీన్ లోషన్ ఎలాగైతే రాసుకుంటామో, అలాగే జుట్టు ఆరోగ్యం పాడవకుండా కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అంతేకాకుండా, బయటికి వెళ్లేటప్పుడు హెయిర్ సీరమ్ రాసుకోవడం, టోపీ పెట్టుకోవడం, జుట్టు పూర్తిగా కవరయ్యేలా స్కార్ఫ్ కట్టుకోవడం లాంటివి ఉపయోగించాలని తెలిపారు. ఇవి కాలుష్యం బారి నుంచి జుట్టును కాపాడుతుందని పేర్కొన్నారు. అయితే ఇవన్నీ గుర్తొచ్చినప్పుడు కాకుండా, క్రమం తప్పకుండా పాటించినప్పుడే ఫలితం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

# గంజాయికి బానిసైన యువతకు డీ అడిక్షన్ సెంటర్‌లో చికిత్స



**అనకాపల్లి, పతాకం న్యూస్:** గంజాయి మత్తుకు బానిసలై నేటి యువత జీవితాలను చిత్తు చేసుకుంటున్నారు. దాని వాడకాన్ని ఓ అలవాటుగా మార్చుకున్న విద్యార్థులు మత్తులో మునిగి తేలుతున్నారు. అందుకోసం ప్రత్యేక సమయాన్ని కేటాయిస్తున్నారు. అంటే గంజాయికి ఎంతగా బానిసలవుతున్నారో ఇక్కడే స్పష్టమవుతోంది. మత్తుకు అలవాటు పడి కొందరు, డబ్బు సంపాదన కోసం మరికొందరు అనేక నేరాలకూ పాల్పడుతున్నారు. అటువంటి వాటిని అరికట్టడం కోసం అనకాపల్లి జిల్లా పోలీసులు చర్యలు చేపడుతున్నారు. అనకాపల్లి జిల్లాలో గంజాయి రవాణాను అరికట్టేలా పోలీసులు ప్రత్యేక చర్యలను చేపడుతున్నారు. రవాణాదారులను గుర్తించి వారిని కటకటాల వెనక్కి నెడుతున్నారు. ఈ క్రమంలో ఈ మత్తు పదార్థం స్థానికంగా ఎవరు వినియోగిస్తున్నారో ప్రత్యేకంగా ఆరా తీస్తున్నారు. దీనికి అలవాటు పడిన వారిలో ముఖ్యంగా విద్యార్థులు, యువత ఎక్కువగా ఉండటం గుర్తించారు. వారికి అవసరమైన వైద్యచికిత్సను అందించి ఈ వ్యసనం నుంచి బయటపడేందుకు సహాయం చేస్తున్నారు.

గంజాయి వాడకంపై గత ప్రభుత్వ హయాంలో అంతగా నిఘా పెట్టలేదు. దీంతో పట్టణాలే కాదు, గ్రామాల్లో కూడా చిన్నచిన్న ప్యాకెట్ల రూపంలో తయారు చేసి అమ్మకాలు చేయడం చాలా ఎక్కువైంది. వీటిని కొనుగోలు చేస్తున్న యువతను గుర్తించి వారిని మాన్పించేలా పోలీసులు చర్యలు చేపట్టారు.

తీరు మార్చుకోకపోతే కేసులు నమోదు చేస్తామని బెదిరించి వారిని మందలించి అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రిలోని వ్యసన విముక్తి కేంద్రానికి తరలించేలా ఈ ఏడాది చర్యలు చేపట్టారు. ఈ ప్రయత్నం సత్ఫలితాలను ఇస్తోంది. ఈ ఏడాది జిల్లాలో 15 మంది గంజాయికి బానిసైన వారిని పోలీసులు గుర్తించారు. వారిని చికిత్సా కేంద్రానికి తీసుకొచ్చారు. స్వచ్ఛందంగా మరో ఎనిమిది మంది బాధితులు కూడా వచ్చారు.

అనకాపల్లి ఆసుపత్రిలోని గంజాయి వ్యసన విముక్తి వార్డులో 15 పడకలు ఉన్నాయి. ఇక్కడ వైద్యాధికారితో సహా ముగ్గురు కౌన్సెలర్లతో కలిసి 14 మంది సిబ్బంది పని చేస్తున్నారు. దీన్ని ఆధునికీకరించేలా ఆర్‌హెచ్‌ఐ సీఎస్ఆర్ (మెగ్నాసిటా ఇండియా కంపెనీ కార్పొరేట్ సామాజిక బాధ్యత) నిధులను కేటాయించింది. మార్చిలోగా ఈ వార్డుకు ఆధునిక హంగులు అమరనున్నాయి. ఈసారి జిల్లాలో గంజాయి నిర్మూలనకు నిఘాను మరింత పటిష్టం చేశామని అధికారులు వెల్లడించారు. ఎన్నడూ లేని విధంగా నిర్మూలనకు చేస్తున్న కార్యానికి మంచి ప్రతిఫలం వస్తుందని తెలిపారు. విముక్తి కేటంద్రాల్లో కేవలం గంజాయి బారిన పడిన వారికే కాకుండా మద్యం అలవాటు ఉన్నావారికి కూడా కౌన్సెలింగ్ ఇస్తున్నామని పేర్కొన్నారు.

## మైక్రోసాఫ్ట్ పెట్టుబడులు రాయలసీమలో ఏర్పాటు చేయాలి : చింతామోహన్




**రాజంపేట, పతాకం న్యూస్:** మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెండ్లను ఒప్పించి ఆ సంస్థ పెట్టుబడులు వెనకబడిన ప్రాంతమైన రాయలసీమలోనే ఏర్పాటు చేసేలా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవ తీసుకోవాలని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతామోహన్ తెలియజేశారు. మైక్రోసాఫ్ట్ పెట్టుబడులు రాయలసీమలోన ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం ఆర్ అండ్ బి అతిథి గఅహం వద్ద నిరసన తెలిపి అనంతరం పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే ప్రసిద్ధిగాంచిన తిరుమల తిరుపతి దేవస్థానంలో రాయలసీమ ప్రాంత ప్రజలకు ప్రాధాన్యత ఇవ్వకుండా ఎక్కడో రాజస్థాన్, ఢిల్లీ, ముంబై ప్రాంత ప్రజలకు అవకాశాలు కల్పిస్తున్నారని విమర్శించారు. 11 వందల కిలోల బంగారం భక్తులు టీటీడీ కి ముడుపుల రూపంలో చెల్లిస్తే ఆ బంగారం ప్రస్తుతం ఎక్కడుందో, ఏ స్థితిలో ఉందో తెలియజేయకుండా టీటీడీ వారు గోప్యంగా ఉంచడం సబబు కాదని, 50 కిలోల బంగారం మాయమైనట్లు ఇటీవలే సమాచారం అందినట్లు తెలిపారు. వారం రోజుల లోపు టీటీడీ ఆధీనంలో ఎంత బంగారం నిల్వలు ఉన్నాయో టీటీడీ ఈవో నివేదిక ఇవ్వాలని డిమాండ్ చేశారు. టీటీడీ భూములను ఒబేరారు వంటి కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని, దీనివలన తిరుమల తిరుపతి దేవస్థానం పర్యావరణ స్థితిగతులు దెబ్బతింటాయని ఆవేదన చెందారు. విఐపి దర్శనాలు కొందరికే కట్టబెడుతున్నారని, టిడిపి, బిజెపి తప్ప ఇతర పార్టీలలో, ఇతర ప్రాంతాలలో శ్రీనివాసుడు భక్తులు లేరా అని ప్రశ్నించారు. రాయలసీమలో నిరుద్యోగిత ఎక్కువగా ఉందని, చంద్రబాబు చెబుతున్న బనకచర్ల తీసుకొచ్చేందుకు ఇంకా వంద సంవత్సరాలు పైబడి కూడా సాధ్యం కాదని, పోలవరం కూడా ఇప్పుడిప్పుడే సాధ్యం కాదని, రాయలసీమలోని రాజంపేట మండలానికి చెందిన మాతఅమూర్తికి జన్మించిన మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెండ్ల రూ 10 లక్షలకోట్లు పెట్టుబడులు భారత్ లో పెట్టాలని ఇటీవల ప్రధాని నరేంద్ర మోడీని కలిస్తే గుజరాత్ లో పెట్టుబడులు పెట్టాల్సిందిగా మోడీ సూచించినట్లు తెలిపారు. ఇదే సమయంలో రాయలసీమ ప్రాంతానికి చెందిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చాకచక్యంగా వ్యవహరించి వెనుకబడిన ఇదే ప్రాంతానికి చెందిన సత్య నాదెండ్ల చే మైక్రోసాఫ్ట్ పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకురావాలన్నారు.




## 32 ఏళ్ల రికార్డ్ బద్దలు.. చరిత్ర సృష్టించిన విఙ్ఞేష్



ఐపీఎల్ 2026 సీజన్ వేలానికి ముందు చాలా మంది ప్లేయర్లను ఫ్రాంచైజీలు వదిలేశాయి. అలానే ముంబై ఇండియన్స్ కూడా యువ స్పిన్నర్ విఙ్ఞేష్ పుతుర్ వదులుకుంది. అలా ముంబై వదిలేసిన ఈ యువ ఆటగాడు చరిత్ర సృష్టించాడు. క్రికెట్ చరిత్రలోనే కని విని ఎరుగని ప్రపంచ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. లిస్ట్-ఏ క్రికెట్‌లో ఒకే మ్యాచ్‌లో అత్యధిక క్యాచ్‌లు అందుకున్న ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. ప్రతిష్టాత్మక దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో విజేష్ పుతుర్ ఈ అరుదైన ఘనత సాధించడమే కాకుండా 32 ఏళ్ల రికార్డును బద్దల కొట్టాడు. ఇక వివరాల్లోకి వెళ్తే..

విజయ్ హజారే టోర్నీ 2025-26లో భాగంగా బుధవారం త్రిపుర, కేరళ మధ్య మ్యాచ్ జరిగింది. కేరళ జట్టు తరపున విఙ్ఞేష్ పుతుర్ బరిలోకి దిగి.. ఉదియన్ బోస్, స్రిదమ్ పాల్, స్వప్నిల్ సింగ్, సౌరభ్ దాస్, అభజిత్ సర్కార్, వికీల క్యాచ్‌లు అందుకున్నాడు. మొత్తం 6 క్యాచ్‌లు అందుకొని ప్రపంచ రికార్డు నమోదు చేశాడు. లిస్ట్-ఏ క్రికెట్‌లో ఒక మ్యాచ్‌లో ఓ ఆటగాడు ఆరు క్యాచ్‌లు అందుకోవడం ఇదే ప్రథమం. ఇప్పటి వరకు లిస్ట్-ఏ క్రికెట్‌లో ఓ ఆటగాడు 5 క్యాచ్‌లు అందుకోవడమే రికార్డు. 1993లో సౌతాఫ్రికా దిగ్గజం జాంటీ రోడ్స్ వెస్టిండీస్‌తో మ్యాచ్‌లో 5 క్యాచ్‌లు అందుకున్నాడు. ఆ తర్వాత 2002లో బ్రాడ్ యంగ్, 2023లో హాండ్స్‌కొంబ్, 2025లో అరీన్ సంగ్మా, హ్యారీ బ్రూక్ ఈ రికార్డ్‌ను సమం చేశారు. 32 ఏళ్లుగా చెక్కుచెదరకుండా ఉన్న ఈ రికార్డ్‌ను విఙ్ఞేష్ పుతుం మాత్రం తాజాగా 6 క్యాచ్‌ల అందుకుని బ్రేక్ చేశాడు.

## జోరుమీదున్న భారత మహిళల క్రికెట్ జట్టు..

# గెలుపే లక్ష్యంగా బరిలోకి..



వరుస విజయాలతో జోరుమీదున్న భారత మహిళల జట్టు.. సిరీసపై గురి పెట్టింది. శుక్రవారం శ్రీలంతో జరిగే మూడో టీ20లో భారత్ గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. 2-0తో ఆధిక్యంలో ఉన్న హర్మన్‌ప్రీత్ సేన.. ఐదు మ్యాచ్‌ల సిరీసను మరో రెండు మిగిలుండగానే పట్టేయాలనుకొంటోంది. భారత బ్యాటింగ్ బలంగా కనిపిస్తోంది. రెండో మ్యాచ్‌లో షఫాలీ వర్మ అదరగొడితే.. తొలి టీ20లో జెమీమా ఆదుకొంది. అయితే, డాషింగ్ ఓపెనర్ స్మృతి మంధాన బ్యాట్ నుంచి ఆశించిన రీతిలో పరుగులు రావడం లేదు. కెప్టెన్ హర్మన్‌కు కూడా పెద్దగా ఆడే అవకాశాలు రాలేదు. అయితే, గడచిన రెండు మ్యాచ్‌ల్లో మన బౌలర్లు ప్రత్యర్థిని 121/6, 128/9 స్కోర్లకే పరిమితం చేశారు. యువ స్పిన్నర్లు శ్రీచరణి, వైష్ణవి శర్మ, క్రాంతి గౌడ్ కట్టుదిట్టంగా బంతులేస్తూ ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేస్తున్నారు. ఆల్‌రౌండర్ దీప్తి శర్మ గైర్హాజరీలో జట్టులోకి వచ్చిన స్నేహ్ రాణా కూడా పొదుపుగా బౌలింగ్ చేసి లంక బ్యాటర్లను ఒత్తిడిలోకి నెట్టింది. తొలి మ్యాచ్‌తో పోల్చితే మనోళ్ల ఫీల్డింగ్ మెరుగుపడుతోంది. మొదటి మ్యాచ్‌లో ఐదు క్యాచ్‌లు చేజార్చిన భారత ప్లేయర్లు.. రెండో టీ20లో మూడు రనౌట్లు చేయడం విశేషం. సిరీసలో మిగిలిన మూడు మ్యాచ్‌లు ఇక్కడే జరగనుండడం భారత్‌కు సానుకూలాం శమే. ఇక దీప్తిశర్మ ఫిట్‌నెసపై ఎలాంటి సమాచారం లేదు.

మరోవైపు తీవ్ర ఒత్తిడిలో ఉన్న లంక.. ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను సజీవంగా ఉంచాలనుకుంటోంది. అయితే, టీమ్ బ్యాటింగ్ ఘోరంగా విఫలమవుతోంది. రెండు మ్యాచ్‌ల్లోనూ తొలుత బ్యాటింగ్ చేసిన లంక పోరాడగలిగే స్కోరునైతే సాధించలేకపోయింది. ఆరంభంలో ఫర్వాలేదనిపించినా.. ఒకట్రెండు వికెట్లు కోల్పోయిన తర్వాత ఒక్కసారిగా కుప్పకూలుతోంది. కెప్టెన్ చమరి ఆటపట్టు ఉన్నంత వరకు దూకుడుగా ఆడుతున్నా.. విష్మి గుణ రత్నే, హాసిని పెరీరా, హర్షిత స్కోరు బోర్డును పరుగులు పెట్టించలేక పోతున్నారు. వికెట్ల మధ్య పరిగెత్తుతున్న తీరు కూడా దారుణంగా ఉంది. ఇక, బౌలర్లు భారత బ్యాటర్లను ఏమాత్రం ఇబ్బందిపెట్టలేక పోతున్నారు.

**భారత్:** స్మృతి మంధాన, షఫాలీ వర్మ, జెమీమా, హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), రిచా ఘోష్ (వికెట్ కీపర్), స్నేహ్ రాణా/దీప్తి, అమన్‌జోత్ కౌర్, అరుంధతి రెడ్డి, క్రాంతి గౌడ్, వైష్ణవి శర్మ, శ్రీచరణి.

**శ్రీలంక:** చమరి ఆటపట్టు (కెప్టెన్), విష్మి గుణరత్నె, హాసిని పెరీరా, హర్షిత సమరవిక్రమ, నీలాక్షి, కౌషిని నుత్యాంగన (వికెట్ కీపర్), కవిష దిల్హారి, మాల్కి మదార, ఇనోక రణవీర, క్వాయ కవింది, షాషిని గిమ్హని.

వికెట్ బ్యాటింగ్‌కు అనుకూలం కావడంతో భారీ స్కోర్లు నమోదయ్యే అవకాశం ఉంది. గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో ఆడిన నాలుగు టీ20ల్లో మూడుసార్లు ఛేదన చేసిన జట్లే నెగ్గాయి. ఈ నేపథ్యంలో టాస్ గెలిచిన జట్టు బౌలింగ్ ఎంచుకోవచ్చు. ఆకాశం మేఘావృతమై ఉన్నా.. వర్షం కురిసే అవకాశాలు తక్కువ.




# ఇతరుల అభిప్రాయాల్లో జోక్యం చేసుకోను: హెబ్బా పటేల్



శివాజీ వ్యాఖ్యలపై తాజాగా హీరోయిన్ హెబ్బా పటేల్ స్పందించడం ఆసక్తికరంగా మారింది. ఓ కార్యక్రమంలో ఈ అంశంపై ఆమెను ప్రశ్నించగా, ఇతరుల వ్యాఖ్యలపై స్పందించడం లేదా వారి వ్యక్తిగత అభిప్రాయాల్లో జోక్యం చేసుకోవడం తనకు ఇష్టం లేదని ఆమె తెలిపింది. ఇలాంటి వివాదాలకు దూరంగా ఉండటమే మంచిదని అభిప్రాయపడింది. ఒక మహిళకు తనకు నచ్చిన దుస్తులు ధరించే పూర్తి స్వేచ్ఛ ఉంటుందని, దానిపై ఎవరూ తీర్పులు చెప్పాల్సిన అవసరం లేదని హెబ్బా స్పష్టం చేసింది.
హెబ్బా పటేల్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అవుతున్నాయి.
‘కుమారి 21ఎఫ్’ సినిమాతో టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన హెబ్బా, తొలి సినిమాతోనే యూత్‌లో మంచి క్రేజ్ సంపాదించింది. ఆ తర్వాత వరుస అవకాశాలతో గ్లామర్ రోల్స్‌లో కనిపిస్తూ తనకంటూ ప్రత్యేకమైన ఫాలోయింగ్‌ను ఏర్పరుచుకుంది. స్పెషల్ సాంగ్స్‌కూ ఓకే చెబుతూ ఇండస్ట్రీలో తన స్థానం నిలబెట్టుకుంటోంది. తాజాగా హెబ్బా నటించిన ‘ఈషా’ సినిమా థియేటర్లలో విడుదలై ప్రేక్షకులను అలరిస్తోంది.

# యాంకర్ మైక్ ఇవ్వబోతే, దండం పెట్టి వద్దన్న శివాజీ



దండోరా చిత్రం సక్సెస్ మీట్ సందర్భంగా యాంకర్ స్రవంతి, నటుడు శివాజీకి మైక్ ఇవ్వబోగా, ఆయన వినయంగా దండం పెట్టి వద్దన్నట్లు సైగ చేశారు. ఆయన వేదికపైకి వచ్చి తన స్థానంలో కూర్చున్నాక కూడా యాంకర్ మైక్ ఇచ్చేందుకు ప్రయత్నించగా, శివాజీ సున్నితంగా తిరస్కరించడంతో ఆమె మరొకరికి ఇచ్చారు. దండోరా చిత్రం విడుదలై మంచి టాక్ తెచ్చుకోవడంతో చిత్ర బృందం సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ సినిమా గురించి కొంతమంది మాట్లాడిన అనంతరం శివాజీ ప్రసంగించారు. దండోరా సినిమాకు తన వ్యక్తిగత విషయాలను ముడిపెట్టవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. తన వ్యక్తిగత విషయాలను వేరుగా చూసుకుంటానని, వాటి ప్రస్తావన లేకుండా సినిమాను ప్రోత్సహించాలని కోరారు. అలా కాని పక్షంలో ఆ నింద తాను మోయాల్సి వస్తుందని ఆయన అన్నారు. ఈ సినిమా గురించి మాత్రమే మాట్లాడాలని, థియేటర్‌కు వచ్చి ఏం మాట్లాడాలన్నా అభిమానులతో ముచ్చటిస్తానని తెలిపారు.

ఆయన ఇంకా మాట్లాడుతూ, ఇలాంటి సినిమాలు కొన్ని తరాలకు ఒకసారి మాత్రమే వస్తాయని అన్నారు. రెండు రోజుల ముందు ప్రీమియర్స్ వేసి ఉంటే కలెక్షన్లు వేరే విధంగా ఉండేవని, సెన్సార్ వల్ల విడుదల ఆలస్యమైందని చెప్పారు. దండోరా గురించి 2026 వరకు మాట్లాడుకుంటారని ఆయన అన్నారు. విదేశాల్లో కూడా ఈ చిత్రానికి మంచి ఆదరణ లభిస్తోందని తెలిపారు. ఈ సినిమా షూటింగ్ సమయంలో తాను రోజుకు రెండు గంటలు మాత్రమే నిద్రపోయానని, తన పాత్ర కోసం ముఖం ఉబ్బినట్టు కనిపించేలా నిద్రను తగ్గించానని అన్నారు. సినిమా మొత్తం నిద్ర ముఖంతోనే కనిపిస్తానని చెప్పారు.

నిద్రను తగ్గించమని దర్శకుడు తనకు చెప్పలేదని, ఒకవేళ తన పాత్రకు తగినట్టుగా కనిపించకపోతే దర్శకుడు ఇబ్బంది పడతారని అన్నారు. తనతో పాటు ప్రతి ఒక్కరు ఈ సినిమా కోసం ఎంతో కష్టపడ్డారని తెలిపారు. మంచి సినిమాను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రతి కళాకారుడిపై ఉందని శివాజీ అన్నారు.

# ‘జైలర్’ విలన్ వినాయకన్‌కు షూటింగ్‌లో ప్రమాదం



రజనీకాంత్ హీరోగా నటించిన ‘జైలర్’ సినిమాతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న మలయాళ నటుడు వినాయకన్ షూటింగ్‌లో ప్రమాదానికి గురయ్యారు. ప్రస్తుతం ఆయన కొచ్చిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనతో ఆయన అభిమానులు, సినీ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. వివరాల్లోకి వెళితే... వినాయకన్ ప్రస్తుతం ‘ఆడు 3’ అనే మలయాళ చిత్రంలో నటిస్తున్నారు. తొడుపుజ ప్రాంతంలో జరుగుతున్న షూటింగ్‌లో భాగంగా ఓ యాక్షన్ సన్నివేశం చిత్రీకరిస్తుండగా ఆయన ప్రమాదవశాత్తూ గాయపడ్డారు. ఈ ఘటనలో ఆయన భుజం, మెడ భాగంలోని నరాలు, కండరాలకు తీవ్ర గాయాలైనట్లు వైద్యులు తెలిపారు. వెంటనే యూనిట్ సభ్యులు ఆసుపత్రికి తరలించడంతో పెద్ద ప్రమాదం తప్పిందని, ఆయనకు కనీసం ఆరు వారాల పూర్తి విశ్రాంతి అవసరమని సూచించారు.

వినాయకన్ ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా ‘ఆడు 3’ సినిమా షూటింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఎన్నో సినిమాల్లో విలక్షణ నటనతో ఆకట్టుకున్నప్పటికీ, ‘జైలర్’లో విలన్ పాత్ర వినాయకన్‌కు మంచి పేరు తెచ్చిపెట్టింది. అయితే, సినిమాల కన్నా వివాదాలతోనే ఆయన ఎక్కువగా వార్తల్లో నిలుస్తుంటారు. గతంలో మద్యం మత్తులో పోలీస్ స్టేషన్‌లో, ఎయిర్‌పోర్ట్‌లో, హోటల్‌లో గొడవపడిన ఘటనల్లో ఆయనపై కేసులు కూడా నమోదయ్యాయి.






Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**